జనసేనలోకి కొణతాల?

- పవన్‌కల్యాణ్‌తో భేటీ
- ఈ నెలలోనే పార్టీలో చేరతానని చెప్పినట్టు సమాచారం
- అనకాపల్లి ఎంపీ టికెట్ ఆశిస్తున్నట్టు ప్రచారం



హైదరాబాద్‌లో పవన్ కల్యాణ్‌ను కలిసిన సీనియర్ నేత కొణతాల రామకృష్ణ

అనకాపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు సమీపిస్తుండడంతో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో రాజకీయంగా అనేక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అధికార పార్టీకి చెందిన అనేక మంది తెలుగుదేశం, జనసేనల్లో చేరిపోతున్నారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, ఆయన తనయులు రెండు వారాల కిందట తెలుగుదేశం పార్టీలో చేరారు. కాగా, మరో సీనియర్ నేతగా పేరొందిన కొణతాల రామకృష్ణ జనసేనలో చేరేందుకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు ఆయన బుధవారం హైదరాబాద్‌లో పవన్‌కల్యాణ్‌ను కలిశారు. ఈ భేటీలో ఉత్తరాంధ్రకు సంబంధించిన అనేక విషయాలపై చర్చించినట్టు కొణతాల అనుచరులు చెబుతున్నారు. మంచి రోజు చూసుకుని ఈ నెలలోనే పార్టీలో చేరతానని పవన్‌కల్యాణ్‌కు కొణతాల చెప్పినట్టు సమాచారం. ఆయన అనకాపల్లి ఎంపీ టికెట్ ఆశిస్తున్నట్టు తెలిసింది. గవర సామాజిక వర్గానికి చెందిన కొణతాల రామకృష్ణ 1989 నుంచి 1996 వరకు అనకాపల్లి ఎంపీగా పనిచేశారు. 2004 నుంచి 2009 వరకు డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మంత్రివర్గంలో వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, న్యాయ శాఖల మంత్రిగా ఉన్నారు. 2009 ఎన్నికల్లో అనకాపల్లి నుంచి అసెంబ్లీకి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం ...ఆయన తనయుడు ... మిగతా 4వ పేజీలో

బై బై వైసీపీ



అధికార పార్టీని వీడుతున్న కార్పొరేటర్లు

ఒకరి తర్వాత ఒకరు బయటకు...

ఇప్పటికే ఇద్దరు జనసేనలో చేరిక

- త్వరలో మరో నలుగురు కార్పొరేటర్లు రాజీనామా
- టీడీపీలో చేరే అవకాశం
- నేడో..రేపో అధికారికంగా ప్రకటన
- అదేబాటలో మరో పది మంది కార్పొరేటర్లు
- టీడీపీ, జనసేనల్లో చేరనున్నట్టు ప్రచారం
- జీవీఎంసీ పాలకవర్గం పెద్దల్లో అలజడి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) పాలకవర్గంలో అలజడి మొదలైంది. అధికారంలో ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి కార్పొరేటర్లు ఒకరి తర్వాత ఒకరు ఇతర పార్టీల్లోకి వెళ్లిపోతున్నారు. దక్షిణ నియోజకవర్గ పరిధిలోని ఇద్దరు కార్పొరేటర్లు ఇప్పటికే వైసీపీని వీడి జనసేనలో చేరిపోయారు. తాజాగా అదే నియోజకవర్గానికి చెందిన మరో నలుగురు కూడా పార్టీని వీడిపోవాలని నిర్ణయించుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. అందులో భాగంగానే సిట్టింగ్ ఎమ్మెల్యే వాసుపల్లికి వ్యతిరేకంగా విలేకరుల సమావేశం పెట్టారని ఆ పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు.

మూడేళ్ల కిందట జరిగిన జీవీఎంసీ ఎన్నికల్లో వైసీపీ 58 వార్డులను గెలుచుకోగా, ... మిగతా 4వ పేజీలో



విలేకరుల సమావేశంలో సీతంరాజు సుధాకర్, వైసీపీ కార్పొరేటర్లు

త్వరలో వైసీపీకి పలువురు కార్పొరేటర్లు రాజీనామా

- బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్
- పార్టీని నమ్ముకున్న వారికి జగన్ న్యాయం చేయడం లేదని ఆరోపణ
- పార్టీ కోసం రూ.కోట్లు ఖర్చు చేసినా పట్టించుకోలేదని విమర్శ

విశాఖపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖపట్నం నగర పాలక సంస్థలో వైసీపీ కార్పొరేటర్లు పలువురు త్వరలో ఆ పార్టీకి రాజీనామా చేయనున్నారని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్ అన్నారు. ఇటీవల వైసీపీకి రాజీనామా చేసిన ఆయన బుధవారం దసపల్లా హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వైసీపీకి చెందిన నలుగురు కార్పొరేటర్లు ఉరుకూటి నారాయణరావు, బిపిన్‌కుమార్ జైన్, చెన్నా జానకీరామ్, విల్లూరి భాస్కరరావు (వైసీపీ మద్దతుదారు)లతో కలిసి మాట్లాడారు. విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ అభివృద్ధిని పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పార్టీని నమ్ముకున్న వారికి జగన్ న్యాయం చేయడం లేదని, దానికి తానే ప్రత్యక్ష నిదర్శనమని సుధాకర్ అన్నారు. జగన్ తండ్రి రాజశేఖర్‌రెడ్డి వద్ద, ఆయన తల్లి విజయలక్ష్మి వద్ద కూడా తాను ఎన్నికల సమయాల్లో చాలా కీలకంగా పనిచేశానన్నారు. 2014 ఎన్నికల్లో వైసీపీ వైఫల్యంపై ఉత్తరాంధ్ర స్థాయి నాయకులందరినీ పిలిచి సమీక్ష సమావేశం నిర్వహించానని, కొన్ని కోట్ల రూపాయలు పార్టీ కోసం ఖర్చు చేశానన్నారు. అయితే తనది వన్ సైడ్ లవ్‌గానే ఉండిపోయిందని, న్యాయం జరగలేదని, అందుకే ఆ పార్టీకి, ఆ పార్టీ ఇచ్చిన బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పదవికి రాజీనామా చేసి బయటకు వచ్చానన్నారు. వైసీపీ ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ కూడా న్యాయం జరగలేదనే బయటకు వచ్చారన్నారు. తామంతా కలిసి విశాఖలో వైసీపీ నుంచి నాయకులను బయటకు తీసుకువచ్చేందుకు శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తామని చెప్పారు. త్వరలోనే తాను వేరే పార్టీలో చేరతానని, అయితే అది కాంగ్రెస్ పార్టీ మాత్రం కాదని స్పష్టంచేశారు. ఎమ్మెల్యే వాసుపల్లి తన కాలేజీలో సంక్రాంతి సందర్భంగా పార్టీ కేడర్‌కు మద్యం, కోళ్లు పంపిణీ చేయించారని, ఇంతకన్నా దారుణం మరొకటి ఉండదన్నారు. ఆ మద్యం అంతా చీప్ లిక్కర్ అని, రాష్ట్ర ప్రభుత్వంలోని పెద్దలే ఆ చీప్ లిక్కర్ తయారుచేయించి అమ్మిస్తున్నారని ఆరోపించారు.

వీసీ ప్రసాదరెడ్డే

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా మరోసారి అవకాశం

- చక్రం తిప్పిన విజయసాయిరెడ్డి

బొత్సకు సర్దిచెప్పినట్టు ప్రచారం



ప్రసాదరెడ్డి

విశాఖపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మాజీ వైస్ ఛాన్సలర్ ప్రసాదరెడ్డినే మళ్లీ ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉప కులపతిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఇది పక్కా రాజకీయ నియామకమని అధికార పార్టీ నాయకులే చెబుతున్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో విశాఖపట్నం జిల్లాలో పోటీ చేసే వైసీపీ నాయకులకు సహకరించడంతో పాటు ఉత్తరాంధ్రలో పార్టీ, అభ్యర్థుల జయాపజయాలపై ఎప్పటికప్పుడు సర్వేలు నిర్వహించడానికి ప్రసాదరెడ్డి ఉపయోగపడతారని, అందుకే ఆయనకు మళ్లీ వీసీ పదవి ఇచ్చారని ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి ఆయన్ను వీసీగా కొనసాగించడం ఉమ్మడి విశాఖ జిల్లా పార్టీ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డికి సుతారమూ ఇష్టం లేదని తెలిసింది. ఆయన వల్ల పార్టీకి చెడ్డపేరు వచ్చిందని, యూనివర్సిటీ రాజకీయ వేదికగా మారిపోయిందనే ప్రచారం జరుగుతున్నందున మళ్లీ అవకాశం ఇవ్వొద్దని అధిష్ఠానానికి చెప్పినట్టు సమాచారం. విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ కూడా అదే అభిప్రాయంతో ఉన్నారని, ఆయన కూడా ప్రసాదరెడ్డికి వీసీగా మళ్లీ అవకాశం ఇవ్వవద్దని సూచించినట్టు తెలిసింది. అయితే రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి పట్టుబట్టి ప్రసాదరెడ్డికి వీసీ పదవి ఇప్పించారని అంటున్నారు. విశాఖపట్నంలో ఆయనకు మంచి టీమ్ ఉందని, సర్వేలు పక్కాగా నిర్వహిస్తారని, పార్టీకి విశ్వాసంగా పనిచేస్తారని, ఆ భరోసాతోనే మళ్లీ నియమిస్తున్నామని బొత్స తదితరులకు సర్దిచెప్పారని అంటున్నారు.

ముందు నుంచి అదే పాట

ప్రసాదరెడ్డే మళ్లీ వీసీగా వస్తారని ఏయూలో కీలక అధికారులు ముందు నుంచి చెబుతూనే ఉన్నారు. అందుకే ఇన్‌చార్జి వీసీని నియమించినా ఆమెకు వెంటనే ఛాంబర్, కారు ఇవ్వలేదు. అలాగే ఏ నిర్ణయమైనా ఆమెకు చెప్పకుండా చేసుకుంటూ పోయారు. వీటిపై ... మిగతా 4వ పేజీలో

శ్రీకాకుళం అంబేడ్కర్ వర్సిటీ, అనంతపురం జేఎన్‌టీయూ ఉపకులపతులుగా ఏయూ ఆచార్యులు



కె.రజని



జీవీఆర్ శ్రీనివాసరావు

విశాఖపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మూడు విశ్వవిద్యాలయాలకు ఉపకులపతులుగా ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన ఆచార్యులు నియమితులయ్యారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా తాజా మాజీ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి మరో మారు నియమితులయ్యారు. అలాగే శ్రీకాకుళంలో బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఏయూ తత్వశాస్త్ర విభాగానికి చెందిన విశ్రాంత ఆచార్యులు కె.రజని, అనంతపురం జేఎన్‌టీయూ ఉపకులపతిగా ఏయూ సివిల్ ఇంజనీరింగ్ విభాగం సీనియర్ ఆచార్యులు జీవీఆర్ శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు విడుదల చేసింది.

ఎమ్మెల్యే వాసుపల్లికి షాక్

- ఆశీల్‌మెట్టలో అనధికారికంగా నిర్వహిస్తున్న రామబాణం కళాశాలకు షోకాజ్
- రూ.2.5 లక్షల జరిమానా
- నిబంధనలకు విరుద్ధంగా మర్రిపాలెం నుంచి తరలించినట్టు గుర్తించిన ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ అధికారులు



విశాఖపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యుడు వాసుపల్లి గణేష్‌కుమార్ ఆశీల్‌మెట్టలోని తన కార్యాలయ భవనంలో అనధికారికంగా జూనియర్ కళాశాల (రామబాణం) నిర్వహిస్తుండడాన్ని ఇంటర్ బోర్డు తీవ్రంగా పరిగణించింది. ఈ వ్యవహారంపై బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఆర్.సత్యనారాయణ స్పందించి, షోకాజ్ నోటీస్ జారీచేశారు. మర్రిపాలెంలోని రాణాప్రతాప్‌నగర్‌లో గల ఎమ్మెల్యే నివాసం భవనంలో రామబాణం కళాశాల (కోడ్ నంబరు 02029) నడుపుతున్నారు. అక్కడ నుంచి కళాశాలను ఆశీల్‌మెట్టకు తరలించినట్టు బోర్డు అధికారులు గుర్తించారు. నిబంధనల మేరకు జూనియర్ కళాశాలను ఒకచోట నుంచి మరో ప్రాంతానికి తరలించాలంటే అనుమతి తీసుకోవాలి. కొత్తగా కళాశాల ప్రారంభించే భవనానికి అన్నిరకాల అనుమతులు పొందాలి. కానీ అవేమీ ... మిగతా 4వ పేజీలో

మిలాన్-2024కు ఏర్పాట్లు

- వచ్చే నెల 19 నుంచి 27 వరకూ రెండు దశలుగా నిర్వహణ
- ఉపరాష్ట్రపతి, సీఎం, కేంద్ర రక్షణ మంత్రి రాక
- అధికారుల సమీక్షలో కలెక్టర్ - 4లో

కిక్కిరిసిన రైళ్లు



రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ వద్ద బుధవారం తిరుగు ప్రయాణికుల రద్దీ

- పండుగకు స్వస్థలాలకు వచ్చిన వారంతా తిరుగు ప్రయాణం
- సికింద్రాబాద్, చెన్నై, బెంగళూరు రైళ్లకు డిమాండ్
- చాలా రైళ్లలో ఈ నెల 26 వరకూ బెర్తులు లభించని పరిస్థితి
- బెంగళూరు రైళ్లు వచ్చే నెల 13 వరకూ ఫుల్

విశాఖపట్నం, జనవరి 17: సంక్రాంతి పండుగ జరుపుకునేందుకు స్వస్థలాలకు వచ్చిన వారంతా తిరుగు ప్రయాణం కావడంతో రైళ్లు కిటకిటలాడుతున్నాయి. ముఖ్యంగా సికింద్రాబాద్, చెన్నై, బెంగళూరు వెళ్లే రైళ్లకు డిమాండ్ ఎక్కువగా ఉంది. బెర్త్ రిజర్వేషన్ చేయించుకోనివారు... జనరల్ కోచ్‌లలో సీట్ల కోసం రైలు బయలుదేరడానికి గంట ముందుగానే స్టేషన్‌కు చేరడంతో బుధవారం ప్లాట్‌ఫామ్‌లు కిటకిటలాడాయి. జనరల్ టికెట్ ప్రయాణికులు కొందరు తప్పనిసరి పరిస్థితుల్లో జరిమానా చెల్లించేందుకు సిద్ధపడి రిజర్వేషన్ కోచ్‌లలో ఎక్కారు. విజయవాడ, గుంటూరు పరిసర ప్రాంతాలకు వెళ్లేవారు ఉదయం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12805), సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17240), మధ్యాహ్నం రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12717), మెయిల్ ఎక్స్‌ప్రెస్ (12839), ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18463), తిరుమల ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆశ్రయించారు.

సికింద్రాబాద్ రైళ్లకు డిమాండ్

పండుగ తిరుగు ప్రయాణికులతో సికింద్రాబాద్, హైదరాబాద్ రైళ్లకు విపరీతమైన డిమాండ్ నెలకొంది. విశాఖ నుంచి బయలుదేరే గోదావరి ఎక్స్‌ప్రెస్ (12727), విశాఖ-మహబూబ్‌నగర్ (12861), ఎల్‌టీటీ (18519), విశాఖ-నాందేడ్ (20811), గరీబ్‌రథ్ (12739), వందేభారత్ (20833), జన్మభూమి (12805), దురంతో (22203), విశాఖ-కాచీగూడ (18561), విశాఖ-కర్నూలు ప్రత్యేక రైలు (08541), విశాఖ-సికింద్రాబాద్ స్పెషల్ (08579) వంటి ఒరిజినేటింగ్ రైళ్లతోపాటు విశాఖ (17015), కోణార్క్ (11020), ఫలక్‌నుమా (12703), సంబల్‌పూర్-నాందేడు ఎక్స్‌ప్రెస్ (20809)లు కిక్కిరిశాయి. ఈ రైళ్లలో ఈనెల 26వ తేదీ వరకు బెర్తులు రిజర్వు అయిపోయాయి. కాగా, వందేభారత్‌కు ఈనెల 23వ తేదీ నుంచి సీట్లు ఖాళీ ఉండగా, 24న విశాఖ-సికింద్రాబాద్ ... మిగతా 4వ పేజీలో

జోనల్ కమిషనర్ బరితెగింపు

యథేచ్ఛగా వసూళ్లు

- రోజుకు రూ.లక్ష జేబులో పడాల్సిందే
- అవుట్‌సోర్సింగ్ ఉద్యోగికి కలెక్షన్ బాధ్యత
- టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, ప్రజారోగ్య విభాగాల నుంచి కూడా నెలవారీ మామూళ్లు కోసం ఒత్తిడి
- స్థానిక అధికార పార్టీ నేత అండతో చెలరేగిపోతున్న వైనం
- చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీలో ఒక జోనల్ కమిషనర్‌పై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రోజుకు రూ.లక్ష కలెక్షన్ లక్ష్యంగా పెట్టుకున్నట్టున్నారని, రెవెన్యూ, ప్రజారోగ్య విభాగాల నుంచి కూడా నెలవారీ మామూళ్లు అందాల్సిందేనని హుకుం జారీచేసినట్టు సిబ్బందే ఆరోపిస్తున్నారు. తన సామాజిక వర్గానికి చెందిన ఒక అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిని ప్రత్యేకంగా వసూళ్ల కోసం నియమించుకున్నారంటున్నారు.

అత్యంత కీలకమైన జోన్‌కు కమిషనర్‌గా పనిచేస్తున్న ఆ అధికారి తీరు జీవీఎంసీలో చర్చనీయాంశంగా మారింది. అధికార పార్టీలో తనకున్న పలుకుబడితో పారిశ్రామికంగా, వాణిజ్యపరంగా ప్రధానమైన జోన్‌కు ఏడాది కిందట కమిషనర్‌గా పోస్టింగ్ వేయించుకున్నారు. ఆయన గతంలో కూడా జీవీఎంసీ పరిధిలో జోనల్ కమిషనర్‌గా పనిచేశారు. అప్పుడు తప్పుడు డాక్యుమెంట్లతో దాదాపు 200 వరకూ ఆస్తి పన్ను అసెస్‌మెంట్‌లు జారీచేసేశారనే ఆరోపణలు వచ్చాయి. దాంతో ఆయన్ను జీవీఎంసీ నుంచి సీడీఎంఏకు సరండర్ చేసేశారు. తర్వాత పొరుగు జిల్లాలో కొన్నాళ్లు పనిచేసి...తనకున్న రాజకీయ పలుకుబడిని ఉపయోగించి తిరిగి జీవీఎంసీలో పోస్టింగ్ తెచ్చుకున్నారు. జోన్‌ను కూడా జీవోలోనే పొందుపరిచేలా చక్రం తిప్పారు. రెండోసారి జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన ఆ నియోజకవర్గ అధికార పార్టీ నాయకుడిని ప్రసన్నం చేసుకున్నారు. 'మీరు ఎలా చెబితే అలా చేస్తాను. ప్రతిరోజూ ఉదయం ముందుగా మీ వద్దకు వచ్చిన తర్వాతే కార్యాలయానికి వెళతానని'...చెప్పారని, అంతేగాకుండా మామూళ్లలో కొంతవాటాను సదరు నాయకుడి కుటుంబ సభ్యుడికి ముట్టజెబుతుంటారనే ప్రచారం జీవీఎంసీ వర్గాల్లో జరుగుతోంది. జోనల్ కమిషనర్ కార్యాలయంలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న అటెండర్‌ను తొలగించి తన సామాజిక వర్గానికి చెందిన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిని పెట్టుకున్నారు. అతని ద్వారానే వసూళ్ల దందా సాగిస్తున్నారని సిబ్బంది ఆరోపిస్తున్నారు. జోన్ పరిధిలో జరిగే భవన నిర్మాణాల వద్దకు వెళ్లి ఉల్లంఘనలు ఉన్నాయంటూ యజమానులను హడలగొడుతున్నారు. దీంతో చాలామంది ఎందుకొచ్చిన గొడవని ముడుపులు సమర్పించుకుంటున్నారు. ఒకవేళ అప్పటికీ ... మిగతా 4వ పేజీలో

బాధ్యతలను విస్మరించామనడం అవాస్తవం

ప్రభుత్వ షోకాజ్ నోటీసులకు అంగన్‌వాడీల సమాధానం

మర్రిపాలెం, జనవరి 17: ప్రభుత్వం జారీచేసిన షోకాజ్ నోటీసులకు అంగన్‌వాడీలు బుధవారం సమాధానాలిచ్చారు. తమ డిమాండ్ల సాధనకు సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బందికి ప్రభుత్వం నోటీసులు జారీ చేసి...పది రోజుల్లో సమాధానం ఇవ్వాలని పేర్కొంది. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు బుధవారం మర్రిపాలెం ఐసీడీఎస్ అర్బన్ కార్యాలయానికి ప్రదర్శనగా వెళ్లి సీడీపీఓకు లిఖిత పూర్వక సమాధాన పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన విధులను, బాధ్యతలను తాము విస్మరించామన్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. సహజ న్యాయసూత్రల ప్రకారం విచారించకుండా, తమపై ఎటువంటి చర్యలు తీసుకోవద్దని సీడీపీవోకు అందజేసిన సమాధానాల్లో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వై.తులసి, నాయకులు, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



సీడీపీవోకు షోకాజ్ నోటీసులకు సమాధాన పత్రాలు అందిస్తున్న ప్రతినిధులు



మర్రిపాలెం ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట బైఠాయించిన అంగన్‌వాడీలు

బాల రాముడి వర్ణ చిత్రాల పోటీలకు ఆహ్వానం

డాబాగార్డెన్స్, జనవరి 17: అయోధ్యలో రామాలయం ప్రారంభానికి సిద్ధమైన శుభ తరుణంలో చిన్నారులను ఈ సంబరాల్లో భాగస్వామ్యం చేయాలని వేద విజ్ఞాన సమితి సంకల్పించినట్టు ప్రముఖ చిత్రకారులు నుదురుపాటి అప్పలనరసయ్య తెలిపారు. ఈ నేపథ్యంలో బాల రాముడి వర్ణ చిత్రాల పోటీ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మొదటి ముగ్గురు విజేతలకు రూ.1,116 బహుమతిగా అందించడంతోపాటు పాల్గొన్న వారందరికీ శ్రీరాముని ఆశీస్సులతో కూడిన ప్రశంసా పత్రాలను పంపిణీ చేస్తామన్నారు. 6 నుంచి 15 సంవత్సరాల మధ్య వయసు గల పిల్లలు ఎవరైనా ఏ ప్రాంతం నుంచైనా వారి ఇంట్లోనుంచే ఈపోటీలలో పాల్గొనవచ్చునని తెలిపారు. బాలరాముడు ప్రధాన అంశంగా వేసిన ఒక వర్ణ చిత్రాన్ని వేయాలన్నారు. పేరు, ఊరు, చదువుతున్న తరగతి, వర్ణ చి త్రం ఫొటో తీసి ఈ నెల 21వ తేదీలోపు 81256 74182 నంబరుకు వాట్సప్ ద్వారా పంపాలన్నారు. విజేతలను ఈ నెల 22న ప్రకటిస్తామన్నారు.

విద్యార్థినికి సత్కారం



రిషికను సత్కరిస్తున్న కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జిత్

అక్కయ్యపాలెం, జనవరి 17: న్యూఢిల్లీలో ఎన్‌సీఈఆర్‌టీ నిర్వహించిన జాతీయ స్థాయి కళా ఉత్సవ్ 2024 సాంస్కృతిక పోటీల్లో తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న జి.రిషిక క్లాసికల్ డ్యాన్స్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచింది.ఈ మేరకు ఆమెకు విద్యా మంత్రి, కేవీఎస్ కమిషనర్, ఎన్‌సీఈఆర్‌టీ ఉన్నత అధికారుల నుంచి ఢిల్లీలో సత్కారాలు అందుకుంది. ఈ నేపథ్యంలో రిషికను బుధవారం కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్ కమల్ జిత్, ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. సంగీత ఉపాధ్యాయుడు డాక్టర్ త్యాగరాజ్ ద్వారంను అభినందించారు. అలాగే రిషికకు గణతంత్ర దినోత్సవ వేడుకలకు హాజరుకావాలని ఆహ్వానం అందింది.

బ్రహ్మా బాబా స్మృతి దినోత్సవం..

డాబాగార్డెన్స్, జనవరి 17: ప్రజాపిత బ్రహ్మాకుమారీస్ సంస్థ స్థాపించిన బ్రహ్మా బాబా 55వ అవ్యక్త స్మృతి దినోత్సవం, ప్రపంచ శాంతి దినోత్సవాలను బ్రహ్మాకుమారీస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన ఈ వేడుకల్లో బ్రహ్మాకుమారీస్ ప్రతినిధి రామేశ్వరీ తదితరులు పాల్గొన్నారు. మానసిక ఒత్తిడి నుంచి బ్రహ్మాకుమారీ బోధనలు ద్వారా విముక్తి లభిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రతినిధులు బీకే శివలీల, శశికళ, సత్యవతి, బీకే వేణి, వీరభద్రరావు పాల్గొన్నారు.

20న రౌండ్ టేబుల్ సమావేశం

డాబాగార్డెన్స్, జనవరి 17: రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరం ఆంధ్రప్రదేశ్, వైజాగ్ ఎన్జీవో ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 20న ఎంవీపీ కాలనీలో ఎస్‌వీవీపీ డిగ్రీ కళాశాలలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు నరవ ప్రకాశరావు తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ పార్టీలు పిల్లల కోసం ఏం చేస్తాయో ప్రకటించాలని అని కోరుతూ ఈ సమావేశం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఉత్సాహమైన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కోరారు.

వ్యక్తి ఆత్మహత్య



ఉరేసుకున్న రాజు

సీతంపేట, జనవరి 17: నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ముస్లింతాటిచెట్లపాలెం అక్కయ్యపాలెం అబీద్‌నగర్‌కి చెందిన పొదులాపు రాజు (40) స్క్రాప్ దుకాణంలో పని చేస్తుంటారు. ఆయన మంగళవారం రాత్రి ఇరుగుపొరుగునున్న ఓ ఇంటికి వెళ్లి మహిళతో మాట్లాడాడు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు వచ్చి రాజును మందలించారు. దీంతో మనస్తాపం చెందిన రాజు ఇంట్లో ఉండిపోయాడు. ఈ క్రమంలో బుధవారం తన కుమారుడిని బయటకు ఏదో పనిచూపి బయటకు వెళ్లామన్నాడు. అనంతరం ఇంట్లో పైకప్పుకు ఉన్న రాడ్డుకి చున్నితో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటికి వచ్చిన అతని భార్య తలుపులు కొట్టినా, తలుపులు తీయకపోవడంతో స్థానికులతో చెప్పి పోలీసులకు సమాచారమందించారు. దీంతో పోలీసులు వచ్చిచూసేసరికి రాజు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపడుతున్నారు.

వైద్యునిపై నర్సింగ్ సిబ్బంది ఫిర్యాదు

మహారాణిపేట, జనవరి 17: కేజీహెచ్ పీడియాట్రిక్ విభాగంలో వైద్యుడు వార్డులో నర్సింగ్ సిబ్బందిపై చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ అశోక్‌కుమార్‌కు వారు ఫిర్యాదు చేశారు. బుధవారం ఉదయం పిల్లల వార్డులో వైద్యుడు విధుల్లోఉన్ననర్సింగ్ చేపడుతున్న సేవలపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ కొన్ని వ్యాఖ్యలు చేశారు. దీంతో నర్సింగ్ సిబ్బంది నిరసనవ్యక్తంచేస్తూ ఫిర్యాదుచేశారు. ఈ ఘటనపై విచారణ చేయనున్నట్టు సూపరింటెండెంట్ తెలిపారు.

భక్తులకు వారధిగా 'భవదీయం'



సంస్థ ప్రారంభోత్సవంలో నిర్వాహకులు

మురళీనగర్, జనవరి 17 ; ఉత్తర నియోజకవర్గంలోని 50వ వార్డు మురళీనగర్‌లో బుధవారం దేవాలయాలకు అనుబంధంగా భవదీయం అనే స్వచ్ఛంద సంస్థను ఆరంభించారు. దేశంలో ప్రముఖ దేవాలయాల్లో సేవల కోసం వెళ్లే సేవకులను పంపించనున్నట్టు ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు రవికుమార్, కార్యదర్శి సుగుణకుమారి తెలిపారు. ఆలయాల్లో సేవకులు, కోలాటం బృందాలు, సాంస్కృతిక సేవల కోసం వెళ్లే వారికి తగిన ప్లాట్‌ఫాంగా తమ సంస్థ నిలుస్తుందన్నారు.

అసోసియేషన్ పేరిట దందా!

- రైల్వే న్యూకాలనీలో పాఠశాలల మైదానం స్వాధీనం
- క్రీడాస్థలాన్ని సొమ్ము చేసుకుంటున్న సభ్యులు
- వాకర్స్ నుంచి నెల వారీ వసూళ్లు
- చెల్లించకుంటే అనుమతి నిరాకరణ
- చిన్నారులకూ నో ఎంట్రీ
- దృష్టి సారించని జీవీఎంసీ యంత్రాంగం



రైల్వే న్యూకాలనీలోని కేఎస్ఎం పాఠశాల



ఫీజు వసూలు చేసేందుకు గేటు ఎదురుగా కూర్చున్న సభ్యుడు

అక్కయ్యపాలెం, జనవరి 17: విద్యార్థుల ఆటల కోసం వినియోగించాల్సిన మైదానాన్ని అసోసియేషన్ పేరిట కొంతమంది స్వాధీనం చేసుకుని, స్వప్రయోజనాలకు వాడుకుంటున్నారు. వాకర్స్ నుంచి నెలవారీ వసూళ్లు చేపడుతున్నారు. చిన్నారులకు ప్రవేశం కల్పించడం లేదు. డబ్బు చెల్లించకుంటే ఎవరికీ ప్రవేశం లేకుండా చేస్తున్నారు. ఇందుకోసం ఓ వ్యక్తిని నియమించి మరీ దందా కొనసాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా జీవీఎంసీ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

గ్రేటర్ 42వ వార్డు రైల్వేన్యూకాలనీలోని కమలా నెహ్రూ మునిసిపల్ (కేఎస్ఎం) బాలికోన్నత పాఠశాల, జీవీఎంసీ ఉన్నత పాఠశాలల మైదానాన్ని రైల్వే న్యూకాలనీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు తమ స్వాధీనంలో ఉంచుకున్నారు. ఇక్కడకు ఉదయపు నడక కోసం వచ్చే వాకర్స్ నుంచి నెలవారీ ఫీజులు వసూలు చేస్తున్నారు. ఈ మైదానంలో ఉదయం, సాయంత్రం వాకింగ్ చేయాలంటే నెలకు రూ.100 చెల్లించాలని, లేదంటే అనుమతి లేదని తెగేసి చెబుతుండడంతో వాకర్స్ అవాక్కవుతున్నారు. కొంత స్థలంలో వాకింగ్ ట్రాక్, మెడిటేషన్ సెంటర్ ఏర్పాటు చేసి అందులో ఓవైపు బుద్ధుడి విగ్రహం, మరోవైపు అసోసియేషన్ కార్యాలయం నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాల మైదానంలో జీవీఎంసీ ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసింది. దీనిని కూడా అసోసియేషన్ సభ్యులు స్వాధీనం చేసుకున్నారు. ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకు మాత్రమే తెరచి ఉంచి, ఆ తర్వాత మూసేస్తారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 8 వరకు అనుమతిస్తున్నారు. ఈ ఓపెన్ జిమ్‌లో ప్రవేశాలకు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కూడా అవకాశం కల్పించడంలేదు. అసలు వీరికి ఈ స్థలాన్ని ఎవరు కేటాయించారో తెలియని విచిత్ర పరిస్థితి నెలకొంది.

బాస్కెట్ బాల్ శిక్షణకు అడ్వాన్స్ రూ.2వేలు

అదే విధంగా బాస్కెట్ బాల్ శిక్షణకు అడ్వాన్స్ రూ.2వేలు చెల్లించాలి. నెలకు రూ.500 చొప్పున కట్టాలి. కరాటే నేర్చుకోవడానికి కూడా అదే పరిస్థితి. స్కూల్ ఆవరణలో సగం స్థలాన్ని అసోసియేషన్ సభ్యులు సొమ్ము చేసుకుంటున్నారు.

ఇరుకు గదుల్లో విద్యార్థులు

కేఎస్ఎం బాలికోన్నత పాఠశాలలో 370 మంది విద్యార్థినులు, జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో 308 మంది విద్యార్థులున్నారు. వీరికి తరగతి గదులు తక్కువగా ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరండాల్లో తరగతులు నిర్వహించాల్సి వస్తోంది. పాఠశాల ఆవరణలో ఉన్న మరుగుదొడ్లను స్టోర్ రూమ్‌గా వినియోగించాల్సిన దుస్థితి. అసోసియేషన్ ధ్యానమందిరం, ఆఫీస్ రూమ్, వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేపట్టిన స్థలంలో పిల్లలకు ఉపయోగపడేలా పలు నిర్మాణాలు చేపట్టే వీలుందని విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. ఈ దందాపై జీవీఎంసీ కమిషనర్ స్పందించి అసోసియేషన్ సభ్యుల స్వాధీనంలో ఉన్న పాఠశాలల మైదానం విద్యార్థులకు ఉపయోగపడేలా చేయడంతోపాటు ఖాళీ స్థలంలో తరగతి గదులను నిర్మించాలని కోరుతున్నారు.

అబిద్‌నగర్ పార్కులోనూ వసూళ్లు..

గ్రేటర్ 44వ వార్డు అబిద్‌నగర్‌లో ఏర్పాటుచేసిన పిల్లల పార్కులో ఆడుకోవాలంటే డబ్బులు చెల్లించాల్సిందేనని నిర్వాహకులు చెబుతున్నారు. వారానికొకసారి వెళ్లినా వారినుంచి కూడా ముక్కుపిండి మరీ డబ్బు వసూలు చేస్తున్నారు. డబ్బులు లేకుండా వెళ్లి ఊయల ఊగినా, జారుడు బల్ల జారినా, ఆడుకున్నా వాచ్‌మన్ వచ్చి తరిమేస్తాడు. సెలవుల్లో సరదాగా పార్కుకు వెళ్లి ఆడుకుందామనుకునే వారికి దడ పుట్టిస్తున్నారు. తల్లిదండ్రులు ఇస్తున్న పాకెట్ మనీ పార్కు వారికే చెల్లించాల్సి వస్తోందని పిల్లలు వాపోతున్నారు. జీవీఎంసీ ఏర్పాటు చేసిన పార్కుల్లోకి డబ్బులు వసూలు చేయడమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఫిర్యాదు అందలేదు

పాఠశాల మైదానంలో వాకర్స్ నుంచి అసోసియేషన్ సభ్యులు డబ్బు వసూలు చేస్తున్నట్లు లిఖిత పూర్వకంగా ఎటువంటి ఫిర్యాదు అందలేదు. పాఠశాల ఆవరణ, మైదానంలో అనుమతి లేకుండా ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించకూడదు. మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన అన్నింటినీ పరిశీలించి, చర్యలు తీసుకుంటాం.

- శ్రీనివాస్, డీడీఈవో,
జీవీఎంసీ విద్యా విభాగం



ఓపెన్ జిమ్‌కు తాళాలు వేసిన దృశ్యం



వాకింగ్ ట్రాక్

ముగిసిన మార్వాడి క్రికెట్ పోటీలు



విజేత జట్టు ఆశ పోరాతో ముఖ్య అతిథి ఐజీ రాజీవ్ కుమార్ మీనా

విశాఖపట్నం (స్పోర్ట్స్), జనవరి 17: వాల్తేరు రైల్వే క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన మార్వాడీ క్రికెట్ లీగ్ చాంపియన్‌షిప్ టోర్నీ బుధవారం ముగిసింది. ఫైనల్స్‌లో విజయం సాధించి చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకున్న ఆశ పోరా జట్టు ట్రోఫీతోపాటు రూ.41వేలు బహుమతి, రన్నరప్‌గా నిలిచిన మహాకాళి ఎలెవన్ జట్టు రూ.31 వేలు నగదు బహుమతి అందుకున్నాయి. టోర్నీ ముగింపు కార్యక్రమానికి గ్రేహౌండ్స్ ఐజీ రాజీవ్‌కుమార్ మీనా ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అభినందించారు. ఈ కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు హర్ష పగాడియా తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లు అరెస్టు

సీతంపేట, జనవరి 17: నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ తాటిచెట్లపాలెం ప్రాంతంలో బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్న వారిపై సీఐ విజయకుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ సూర్యారావు సిబ్బందితో దాడి చేశారు. నలుగురు వ్యక్తులను అదుపులో తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 27,650 స్వాధీనం చేసుకున్నారు. మరి కొందరు పరారయ్యారు. వారి కోసం గాలిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

వాల్తేరు డివిజన్‌కు ఐదు పురస్కారాలు



తూ.కో రైల్వే జీఎం నుంచిఅవార్డునందుకుంటున్న దృశ్యం

విశాఖపట్నం, జనవరి 17: రైల్వే అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న వాల్తేరు డివిజన్‌కు ఐదు ఉత్తమ ప్రతిభా పురస్కారాలు లభించాయి. తూర్పుకోస్తారైల్వే పరిధిలోని మేజర్ స్టేషన్ కేటగిరిలో శ్రీకాకుళం రోడ్డు స్టేషన్‌కు ఉత్తమ పరిశుభ్రత స్టేషన్ అవార్డుతోపాటు ఎలక్ట్రికల్, సిగ్నల్ అండ్ టెలికాం శాఖల కు ఉత్త మ పనితీరుకు షీల్డ్‌లు లభించాయి. అలాగే ఆపరేటింగ్, సర్వే అండ్ కన్‌స్ట్రక్షన్ శాఖలకు సంబంధించి కుర్దా డివిజన్‌తో కలిసి మరో రెండు అవార్డులను పొం దింది. బుధవారం భువనేశ్వర్‌లో జరిగిన 68వ రైల్వే వారోత్సవాలలో తూర్పు కోస్తారైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ చేతుల మీదుగా వాల్తేరు డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్‌ప్రసాద్ ఆయా శాఖలకు చెందిన అధికారులతో కలిసి ఈ అవార్డులందుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్తేరు డివిజన్ అభివృద్ధికి చిత్తశుద్ధితో సేవలందిస్తున్న అధికారులు, సిబ్బందిని అభినందించారు.

ఎమ్మెల్యే వాసుపల్లి చర్యలతో ప్రజాస్వామ్యం ఖూనీ

- విద్యా సంస్థలో మద్యం పంపిణీపై చర్యలు తీసుకోవాలి
- 'దక్షిణ' జనసేన పార్టీ నాయకులు మూగి శ్రీనివాసరావు డిమాండ్



మాట్లాడుతున్న మూగి శ్రీనివాసరావు

సీతంపేట, జనవరి 17: విశాఖ దక్షిణ నియోజకవర్గ వైసీపీ షాడో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పవిత్రమైన విద్యా సంస్థలో సంక్రాంతి సందర్భంగా వైసీపీ కార్యకర్తలకు మద్యం, కోడి గుడ్లు పంపిణీ చేయడం దారుణమని, ఈ సంఘటనతో ఆయన ప్రజాస్వామ్యాన్ని పట్టపగలే ఖూనీ చేసినట్లయిందని విశాఖ దక్షిణ నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు డాక్టర్ మూగి శ్రీనివాసరావు విమర్శించారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాసంస్థలో మద్యం పంపిణీ నేపథ్యంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌పై ఎక్సైజ్ చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. దీంతోపాటు విద్య సంస్థలో ఈ పంపిణీలో పాల్గొన్న కార్యకర్తలపైనా చర్యలు తీసుకోవాలన్నారు. మద్యపానం నిషేధం విధిస్తామన్ని చెప్పిన వైసీపీ మద్యపాన నిషేధం చాతకాకపోవడంతోపాటు ఇలా యథేచ్ఛగా మద్యం పంపిణీ చేయడం ప్రజలకు ఎటువంటి సంకేతాలనిస్తోందో అర్థమవుతుందన్నారు. వాసుపల్లి గణేష్ కుమార్ ప్రజల్లోకి వచ్చేటప్పుడు మద్యం తాగివస్తున్నారని, కార్యకర్తలకి మద్యం బాటిల్ పబ్లిక్‌గానే సరఫరా చేస్తున్నారని ఆధారాలు మీడియాలో దొరికిన తర్వాత కూడా ప్రభుత్వం స్పందించకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు పీవీ శివప్రసాదరెడ్డి, మహిళా కోఆర్డినేటర్ మైలపల్లి నాగలక్ష్మి, మైలిపిల్లి తాతారావు, ఆంటోని శేఖర్, శ్రవణ్, జక్కు వాసుదేవరావు, పద్మనాభం, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మిలాన్-2024కు పటిష్ఠ ఏర్పాట్లు

- వచ్చే నెల 19 నుంచి 27 వరకు రెండు దశలలో నిర్వహణ
- హాజరుకానున్న ఉప రాష్ట్రపతి, కేంద్ర రక్షణ మంత్రి, ముఖ్యమంత్రి
- అధికారుల సమీక్ష సమావేశంలో కలెక్టర్ మల్లికార్జున

విశాఖపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నేవల్ కమాండ్ ఆధ్వర్యంలో విశాఖ కేంద్రంగా వచ్చే నెల 19 నుంచి 27 వరకు రెండుదశలలో జరగనున్న మిలాన్-2024 వేడుకలను విజయవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున కోరారు. వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో బుధవారం నేవీ, ఎయిర్‌పోర్టు, పోర్టు, కస్టమ్స్, రెవెన్యూ, పోలీస్, జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ, పర్యాటక అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయా విభాగాలు చేపట్టాల్సిన చర్యలపై మార్గనిర్దేశం చేశారు. అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. మిలాన్ -2024 ఇన్‌చార్జి, నేవల్ కమాడోర్ నీరజ్ అజాద్ మిలాన్ 12వ ఎడిషన్ కార్యక్రమాలను వివరించారు. వచ్చే నెల 19 నుంచి 23 వరకు హార్బర్ ఫేజ్, 24 నుంచి 27 వరకు సీ(సముద్రం) ఫేజ్ కార్యక్రమాలు జరుగుతాయని, దీనికి దేశ, విదేశాల నుంచి అతిథులు వస్తున్నారన్నారు. ఉప రాష్ట్రపతి, కేంద్ర రక్షణ మంత్రి, రాష్ట్ర ముఖ్య మంత్రి ముఖ్య అతిథులుగా హాజరవుతార న్నారు. 50 విదేశీ నౌకలు, 40 వరకు యుద్ధనౌకలు, సబ్‌మెరైన్లు వేడుకల్లో భాగస్వామ్యమవుతాయన్నారు. వచ్చే నెల 18,19 తేదీల్లో దేశ, విదేశాల నుంచి వచ్చే నౌకలు పోర్టు, నేవల్ డాక్‌యార్డుకు చేరుకుంటాయని, 19న విదేశ ప్రముఖులు నగరానికి వస్తారన్నారు. 21న ప్రధాన కార్యక్రమాలకు కేంద్ర రక్షణమంత్రి హాజరవు తారన్నారు. నేవల్ ఆడిటోరియం సముద్రికలో హార్బర్ ఫేజ్ వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. అదే రోజు సాయంత్రం మిలాన్ విలేజ్‌ను రక్షణమంత్రి ప్రారంభి స్తారని, 22న సముద్రికలో జరిగే ప్రత్యేక కార్యక్ర మానికి ఉప రాష్ట్రపతి హాజరవుతారన్నారు. అదే రోజు సాయంత్రం బీచ్ వేదికగా ప్రధాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హాజరవుతాయని నీరజ్ అజాద్ పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

అనంతరం కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ వేడుకలకు ప్రముఖులు రానున్నందున రక్షణ, బందో బస్తు ఏర్పాట్లు చూడాలని పోలీసులను ఆదేశించారు. వేడుకలు వీక్షించేందుకు బీచ్‌లో బారికేడ్లు, తాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. బీచ్ ఏరియాలో సీసీ కెమెరాలు, ఎల్ఈడీలు ఏర్పాటు చేయాలని, ఏపీఐఐసీ, ఏయూ మైదానంలో వాహ నాలకు పార్కింగ్, విశ్వప్రియ ఫంక్షన్‌హాలు, విశాఖ మ్యూజియంలో అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. మిలాన్ జరిగే సమయంలో సముద్రంలో ఎటువంటి కార్యక్రమాలు లేకుండా చూడాలని మత్స్యశాఖ జేడీని ఆదేశించారు. ఎప్పటికప్పుడు నేవీ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. మిలాన్‌లో భాగంగా సిటీ పరేడ్ సందర్భంగా బీచ్‌రోడ్డులో శకటాల ప్రద ర్శన, సాంస్కృతిక ప్రదర్శన ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో తూర్పు నావికాదళానికి చెందిన ఉన్నతాధికారి రాజేష్‌శర్మ, నేవీ కమాండర్లు, డీసీపీ శ్రీనివాసరావు, డీఆర్వో కె.మోహనకుమార్, ఆర్డీవో హుస్సేన్‌సాహెబ్, అధికారులు పాల్గొన్నారు.

బై బై వైసీపీ

... 3వ పేజీ తరువాయి

టీడీపీ 30 వార్డులను గెలుచుకుంది. జనసేన మూడు, సీపీఐ, సీపీఎం, బీజేపీ ఒక్కొక్క వార్డు దక్కించుకున్నాయి. నాలుగుచోట్ల ఇండిపెండెంట్లు గెలిచారు. దీంతో వైసీపీకి చెందిన 11వ వార్డు కార్పొరేటర్ గొలగాని హరివెంకటకుమారిని మేయర్‌గా ఎంపిక చేశారు. దాదాపు మూడేళ్లపాటు జీవీఎంసీ కౌన్సిల్‌లో వైసీపీ ఆధిపత్యానికి అడ్డేలేకుండా పోయింది. జీవీఎంసీకి, నగరవాసులకు ఎంత ఇబ్బంది కలిగించే అంశమైనప్పటికీ సంఖ్యాబలంతో ఏకగ్రీవంగా ఆమోదించుకుంటూ వచ్చారు. వైసీపీ కార్పొరేటర్లలో చాలామంది పార్టీ నేతల తీరు పట్ల అసంతృప్తి ఉన్నప్పటికీ రాష్ట్రంలో అధికారంలో ఉండడంతో బయటపెట్టకుండా వచ్చారు. సాధారణ ఎన్నికలు సమీపిస్తుండడంతో కార్పొరేటర్లలో అసంతృప్తులు ఒక్కొక్కరు బయటపడుతున్నారు. పార్టీలో ఇమడలేమంటూ టీడీపీ, జనసేన పార్టీల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. దక్షిణ నియోజకవర్గం పరిధిలో ఇండిపెండెంట్లుగా గెలిచి వైసీపీలో చేరిన ముగ్గురు కార్పొరేటర్లలో ఇద్దరు ఇటీవలే పార్టీకి గుడ్‌బై చెప్పేశారు. జనసేన పార్టీలో చేరిపోయారు. తాజాగా దక్షిణ నియోజకవర్గానికే చెందిన మరో నలుగురు కార్పొరేటర్లు కూడా పార్టీని వీడాలని దాదాపు నిర్ణయించుకున్నారు. నియోజకవర్గ పరిధిలోని ఎనిమిది మంది కార్పొరేటర్లు రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్ అనుచరులుగా కొనసాగుతున్నారు. సుధాకర్ ఇటీవలే పార్టీని వీడారు. ఆయన తెలుగుదేశం పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. ఈ క్రమంలో 29వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు, 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్‌జైన్, 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకిరామ్‌లు కూడా సుధాకర్ వెంట నడవాలని నిర్ణయించుకున్నారు. బుధవారం సుధాకర్‌తోపాటు నలుగురు కార్పొరేటర్లు దసపల్లా హోటల్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దీంతో వారు కూడా పార్టీని వీడిపోవడం ఖాయమని పార్టీ నేతలు నిర్ధారణకు వచ్చారు. వీరితోపాటు అదే నియోజకవర్గానికి చెందిన మరో నలుగురు కార్పొరేటర్లు, ఉత్తర నియోజకవర్గ పరిధిలోని ఒకరు, పశ్చిమ నియోజకవర్గ పరిధిలో ఒకరు, గాజువాక నియోజకవర్గ పరిధిలోని నలుగురు కార్పొరేటర్లు కూడా పార్టీని వీడిపోవాలని భావిస్తున్నట్టు పార్టీ నేతల్లో చర్చ జరుగుతోంది. వీరంతా పార్టీని వీడిపోతే జీవీఎంసీ కౌన్సిల్‌లో తమ పార్టీ బలం తగ్గిపోతుందని పెద్దలు ఆందోళన చెందుతున్నారు. అదే జరిగితే కౌన్సిల్‌లో పెట్టే అంశాలను ఆమోదించే పరిస్థితి ఉండదని భయపడుతున్నారు.

జనసేనలోకి కొణతాల?

... 3వ పేజీ తరువాయి

జగన్మోహన్‌రెడ్డి వెంట నడిచారు. వైఎస్ఆర్ సీపీ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. 2014 ఎన్నికల అనంతరం వైసీపీకి రాజీనామా చేశారు. అప్పటినుంచి ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఉత్తరాంధ్ర సమస్యలను పాలకుల దృష్టికి తీసుకువెళ్లేందుకు యత్నిస్తున్నారు. అయితే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తె షర్మిల కాంగ్రెస్ రాష్ట్ర బాధ్యతలు స్వీకరించనున్న నేపథ్యంలో ఆయన అందులో చేరవచ్చుననే ఊహాగానాలు వినిపించాయి. ఈ మేరకు కేవీపీ రామచంద్రరావు చర్చలు జరిపినట్టు కూడా ప్రచారం జరిగింది. అయితే కొణతాల జనసేన వైపు మొగ్గుచూపారు.

వీసీ ప్రసాదరెడ్డే

... 3వ పేజీ తరువాయి

ఎన్ని విమర్శలు వచ్చినా వారు వెనక్కి తగ్గలేదు. 'రెండు రోజులు ఆగండి...సారే మళ్లీ వస్తారు' అంటూ అందరికీ చెప్పుకొచ్చారు. ఇప్పుడు అదే నిజమైంది. ఇది ఎన్నికల సమయం కావడం, ప్రసాదరెడ్డి మళ్లీ వీసీగా రావడంతో ఏయూ రాజకీయ కార్యకలాపాలకు కీలకం కానుంది. ఎన్నికల సంఘం అధికారులు దీనికి ఏ విధంగా అడ్డుకట్ట వేస్తారో చూడాలి.

ఎమ్మెల్యే వాసుపల్లికి షాక్

... 3వ పేజీ తరువాయి

లేకుండా...కళాశాల తరలింపునకు దరఖాస్తు చేయకుండా రాణాప్రతాప్‌నగర్ నుంచి ఆశీల్‌మెట్టకు తరలించడాన్ని ఇంటర్ బోర్డు తప్పుబట్టింది. ఈ మేరకు షోకాజ్ జారీచేస్తూ 15 రోజుల్లో సమాధానం ఇవ్వాలని పేర్కొంది. ఇంకా రూ.2.5 లక్షల జరిమానా విధించింది. పక్షం రోజుల్లో షోకాజ్‌కు సమాధానం ఇవ్వడంతోపాటు రూ.2.5 లక్షల జరిమానా చెల్లించాలని ఆదేశించింది. ఒకవేళ సమాధానం ఇవ్వకపోయినా, జరిమానా చెల్లించకపోయినా ఆ కళాశాలలో చదివే విద్యార్థులను రానున్న పరీక్షలకు అనుమతించే విషయంపై ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకుంటారని ఆర్ఐవో సత్యనారాయణ తెలిపారు. కాగా మధురవాడలో ప్రభ జూనియర్ కళాశాలను ఒకచోట నుంచి మరో ప్రాంతానికి అనుమతి లేకుండా తరలించినట్టు గుర్తించడంతో షోకాజ్ జారీ చేశామన్నారు.

కిక్కిరిసిన రైళ్లు

... 3వ పేజీ తరువాయి

ప్రత్యేక వారాంతపు రైలు (08579)కు, 24, 25 తేదీల్లో జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు, 25న దురంతో ఎక్స్‌ప్రెస్‌కు, 26న విశాఖ-మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌లకు బెర్తులు అందుబాటులో ఉన్నాయి.

చెన్నై రైళ్ల పరిస్థితి ఇదీ..

చెన్నై రైళ్లలో ఈ నెలాఖరు వరకూ బెర్తులు నిండిపోయాయి. మెయిల్ (12839), బొకారో (13351), కోరమాండల్ (12841) వంటి రెగ్యులర్ రైళ్లతోపాటు విశాఖ-చెన్నై ఎక్స్‌ప్రెస్ (22801), హౌరా-కన్యాకుమారి (12665), భువనేశ్వర్-పాండిచ్చేరి (12898), భువనేశ్వర్-చెన్నై సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12830), టాటా-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ (18189), షాలిమార్-చెన్నై ఎక్స్‌ప్రెస్ (22825) రైళ్లకు నిరీక్షణ జాబితా నెలకొంది. కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌కు (12841) ఈనెల 26వ తేదీన ఏసీ బెర్తులు అందుబాటులో ఉన్నాయి.

బెంగళూరు రైళ్లు

బెంగళూరు వెళ్లే రైళ్లలో వచ్చే నెల (ఫిబ్రవరి) 13వ తేదీ వరకు బెర్తులు ఫుల్ అయిపోయాయి. ప్రశాంతి (18463), హౌరా-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12863) తదితర రెగ్యులర్ రైళ్లతోపాటు ప్రతి ఆదివారం నడిచే విశాఖ-బెంగళూరు ప్రత్యేక రైలు (08543), హౌరా-బెంగళూరు దురంతో (12245), అగర్తాల-బెంగళూరు హంసఫర్ ఎక్స్‌ప్రెస్ (12504), హటియా-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12835), గుహవటి-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12510), భగల్‌పూర్-బెంగళూరు అంగా ఎక్స్‌ప్రెస్ (12254), అగర్తాల-బెంగళూరు హంసఫర్ (12504), కామాఖ్య-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12552), పూరి-యశ్వంత్‌పూర్ గరీబ్‌రథ్ (22833), టాటా-యశ్వంత్‌పూర్ (18111), జసిడిహ్ జంక్షన్-బెంగళూరు (22306) ఎక్స్‌ప్రెస్‌లలో బెర్తులు ముందే రిజర్వు అయిపోయాయి. టాటా-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12889), హౌరా-మైసూర్ ఎక్స్‌ప్రెస్ (22817), భువనేశ్వర్-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12845), హటియా-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (18637), న్యూ టిన్సుకియా-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (22502), హౌరా-బెంగళూరు ఏసీ ఎక్స్‌ప్రెస్ (22863), ముజాఫర్‌పూర్-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (15228) రైళ్లలో కూడా బెర్తులు అందుబాటులో లేవు. కాగా, ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు ఈనెల 31వ తేదీన ఆర్ఏసీలో సీటు లభిస్తుండగా, తర్వాత రోజుల్లో నిరీక్షణ జాబితా నెలకొంది.

జోనల్ కమిషనర్ బరితెగింపు

... 3వ పేజీ తరువాయి

భవన నిర్మాణ యజమానులు స్పందించకపోతే టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బందిని పిలిచి అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని, అందరికీ మెమోలు ఇవ్వడంతోపాటు కమిషనర్ దృష్టికి తీసుకువెళతానని బెదిరిస్తున్నారు. అలాగే కార్యాలయంలో ఖర్చులు ఉన్నాయంటూ నెలవారీ మామూళ్లు వసూలు చేయిఇస్తున్నారని టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ఆరోపిస్తున్నారు. రెవెన్యూ విభాగంలో కూడా వేలుపెట్టి ప్రతి ఫైలును క్షుణ్ణంగా చూసి ఏదో ఒక కొర్రీ వేసి కిందిస్థాయి ఉద్యోగులు, సిబ్బందిని ఇబ్బందిపెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక ప్రజారోగ్యంలో కూడా తన ప్రతాపాన్ని చూపిస్తున్నారని ఆ విభాగం అధికారులు వాపోతున్నారు. అవుట్‌సోర్సింగ్ కార్మికుల హాజరును నిత్యం తనిఖీ చేస్తూ...కమీషన్‌గా కొంత మొత్తం ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారని వాపోతున్నారు. అవుట్‌సోర్సింగ్ కార్మికుడు ఎవరైనా విధులకు హాజరు కాకపోతే...శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను పిలిచి వారికి హాజరు వేసి, ఆ మొత్తాన్ని తనకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని సమాచారం. అలాగే జీవీఎంసీకి కొన్ని సంస్థలు సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద ఇచ్చే నిధులను కూడా సదరు జోనల్ కమిషనర్ దుర్వినియోగం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఇంత జరుగుతున్నా సదరు జోనల్ కమిషనర్ జోలికి వెళ్లడానికి కమిషనర్ సాహసించలేకపోతున్నారంటున్నారు. అందుకు కారణం అధికార పార్టీ నాయకుడి అండదండలు సదరు అధికారికి పుష్కలంగా ఉండడమేనని జీవీఎంసీ అధికారులు, సిబ్బంది చెబుతున్నారు. సదరు నేత అండ చూసుకునే బరితెగించి వసూళ్లకు పాల్పడుతున్నారని అభిప్రాయపడుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తే ఊరుకోం

ఇంటక్ ప్లాంట్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 17: ఉక్కు కర్మాగారం కార్మికులను ఇబ్బందులు గురిచేస్తే సహించేది లేదని ఇంటక్ ప్లాంట్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ పేర్కొన్నారు. ప్లాంట్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులను ఏదో ఒకవిధంగా ఇబ్బందులు పెట్టేందుకు యాజమాన్యం కుట్ర పన్నుతోందని, దీనివల్ల వారు మనోధైర్యాన్ని కోల్పోతున్నారన్నారు. ఉద్యోగుల సంఖ్య తగ్గింపు అనేది కుట్ర అని, ఇదంతా ప్లాంట్‌ను నిర్వీర్యం చేసేందుకేనని ఆరోపించారు. సంస్థ ప్రగతి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కార్మిక వర్గాన్ని ప్రోత్సహించాల్సిన యాజమాన్యం దుర్మార్గంగా వారిని ఇబ్బందులు పెడుతుండడం దారుణమన్నారు. ప్లాంట్‌లో ఏ ఒక్క కార్మికునికి అన్యాయం జరిగిన సహించేది లేదని రాజశేఖర్ హెచ్చరించారు. సమావేశంలో ఇంటక్ ప్లాంట్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, నాయకులు కారు రమణ, బీఎన్ రాజు, ఎస్‌ఏ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నూతన వేతనాలను అమలు చేయాలి

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 17: ఉక్కు ఉద్యోగులకు నూతన వేతనాలను అమలు చేయాలని, ఇందుకోసం జాతీయ నాయకత్వంపై ఇంటక్, ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్ నాయకులు ఒత్తిడి తేవాలని సీఐటీయూ ఉక్కు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి కోరారు. యూనియన్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై ఈ నెల 29, 30 తేదీల్లో స్టీల్‌ప్లాంట్ సమ్మె జరగనున్న నేపథ్యంలో యాజమాన్యం స్పందించాలన్నారు. కార్మికుల సమస్యలపై చొరవ చూపాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు బి.అప్పారావు, రాజు, మధుసూదన్, శ్రీనివాసరెడ్డి వి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ నియామకం

అగనంపూడి, జనవరి 17: జీవీఎంసీ 79వ వార్డు పరిధి శాంతినగర్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ నూతన కమిటీని బుధవారం ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షునిగా సాహిబ్‌నాయుడు, ఉపాధ్యక్షునిగా కృష్ణారావు, కార్యదర్శిగా మేడిశెట్టి ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా గురునాథ్, ప్రధాన సలహాదారునిగా నరసింగరావు, కోశాధికారిగా సోమశేఖర్ నియమితులయ్యారు. నూతన కమిటీ ప్రతినిధులకు ఆలయ ధర్మకర్త ఈకే చారి అభినందనలు తెలిపారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయలు జయంతి

గాజువాక, జనవరి 17: గాజువాక కాపు సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయల జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత ఇక్కడి శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు జెర్రిపోతుల ముత్యాలు మాట్లాడుతూ ప్రజా రంజక పాలనకు ప్రతిరూపం శ్రీకృష్ణదేవరాయలు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు వెంకటరమణ, ప్రసాద్, భోగేశ్, నరసింగరావు, గోపాల్, సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు పెందుర్తిలో ఎన్టీఆర్ వర్ధంతి

పెందుర్తి, జనవరి 17: పెందుర్తి కూడలి గల ఎన్టీఆర్ విగ్రహం వద్ద గురువారం టీడీపీ వ్యవస్థాపకుడు దివంగత నందమూరి తారక. రామారావు (ఎన్టీఆర్) వర్ధంతి కార్యక్రమం జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు 96వ వార్డు టీడీపీ అధ్యక్షుడు వేగి పరమేశ్వరరావు బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి హాజరుకానున్నట్టు చెప్పారు. కార్యకర్తలు , నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

సినిమా గైడ్

- **నా సామిరంగ :** రమాదేవి, కిన్నెర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సప్తగిరి (తగరపువలస)
- **సైంధవ్ :** సంగం, వెంకటేశ్వర, కామేశ్వరి, లీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శారద, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మినీమోహిని, విశేష్ (గాజువాక), రామలమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** జగదాంబ, మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్, శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 24, టమాటా 22, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 34, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 52, బీరకాయలు 54, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 22, క్యాబేజీ 18, క్యారెట్ 36, దొండకాయలు 20, బంగాళదుంపలు 18, అరటికాయ (పెద్ద) 7, అల్లం (పాతది) 110, మునక్కాడలు (కిలో) 76, బరబాటి 38, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 42, దోసకాయలు 36, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 34 , ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 24, క్యాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 54, చిలగడదుంపలు 30, కంద 60, దేముడుచిక్కుడు 48, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 28, మామిడి అల్లం 60, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	554
విజయనగరం	558
శ్రీకాకుళం	558

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	95
ఫారం ధర	--	115
విత్ స్కిన్	--	200
స్కిన్‌లెస్	--	210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 8 లో..

పరసలకు వేళాయె..

గోపాలపట్నం పరిసరాల్లో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్న ఆయా ఆలయ కమిటీల ప్రతినిధులు

గోపాలపట్నం, జనవరి 17: పుష్యమాసం వచ్చిందంటే గ్రామాల్లో తీర్థాల (పరసలు) సందడి నెలకొంటుంది. సంక్రాంతి పండగ మర్నాడు నుంచే నగర పరిధిలోని పలు గ్రామాలతో పాటు రూరల్ ప్రాంతాల్లో గల గ్రామ దేవతలు, ఇతర ఆలయాల వద్ద పరసలను నిర్వహించడం దశాబ్దాలుగా వస్తున్న ఆచారం. ఈ నేపథ్యంలో అనేక గ్రామాల్లో పరసల ఉత్సవాలు జోరందుకున్నాయి. గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లోని కొత్తపాలెం, చంద్రనగర్, ఎల్లపువానిపాలెం, వెంకటాపురం, పద్మనాభనగర్, కంపరపాలెం, నరవ, కోటనరవ, సత్తివానిపాలెం ప్రాంతాల్లో గల ఆలయాల వద్ద తీర్థాలను నిర్వహించేందుకు ఆయా ఆలయ కమిటీల ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు.



ఫిబ్రవరి 14న పరస జరగనున్న కొత్తపాలెంలోని విజయదుర్గాదేవి ఆలయం

కొత్తపాలెం గ్రామంలో..

గోపాలపట్నం సమీపంలోని కొత్తపాలెం గ్రామంలో మూడుగుళ్లు, పరదేశమ్మ అమ్మవారు, విజయదుర్గాదేవి, భూలోకమ్మ, పోలిపిల్లి అమ్మవారి ఆలయాలతో పాటు నాగేంద్రకాలనీలోని నాగేంద్రుడి ఆలయాల్లో పరసలను ఏటా ఘనంగా పరసలను నిర్వహిస్తారు. ఈ క్రమంలో కొత్తపాలెంలోని పరదేశమ్మ అమ్మవారి పరసను ఈ నెల 26న, విజయదుర్గాదేవి తీర్థాన్ని ఫిబ్రవరి 14న నిర్వహిస్తారు. నాగేంద్రకాలనీలోని నాగేంద్రుడి ఆలయ పరసను మహా శివరాత్రి పర్వదినాన జరుపుతామని ఆలయ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు.

ఎల్లపువానిపాలెంలో..

అలాగే ఎల్లపువానిపాలెం రామాలయ తీర్థాన్ని ఈ నెల 19న, చంద్రనగర్ రామాలయ పరసను 24న జరపనున్నారు. 25న ఎల్లపువానిపాలెంలోని జువ్వాలమ్మ అమ్మవారి పరసను నిర్వహించనున్నారు.

వెంకటాపురం పరిసర ప్రాంతాల్లో..

వెంకటాపురం పరిసరాల్లోని ఆర్ఆర్‌వెంకటాపురం, పద్మనాభనగర్, వెంకటాపురం, కంపరపాలెం ప్రాంతాల్లో గల పలు ఆలయాల్లో తీర్థాలను ఫిబ్రవరి నెలలో నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆర్ఆర్ వెంకటాపురంలోని ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయ తీర్థాన్ని ఫిబ్రవరి నాలుగున, పద్మనాభనగర్‌లోని విశాలాక్షి విశ్వేశ్వర విజయగణపతి ఆలయ పరసను తొమ్మిదిన, పద్మనాభనగర్‌లోని ఎస్సీ, బీసీకాలనీలోని లక్ష్మీగణపతి ఆలయ పరసను 12న నిర్వహిస్తారు. అదేవిధంగా పద్మనాభనగర్ పంచముఖాంజనేయ స్వామి ఆలయ పరసను మార్చి ఐదున జరుపుతారు.

పరసలు జరిగేదిలా..

తీర్థాలను పురస్కరించుకుని ఆయా ఆలయాలను విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించి వేకువజామున దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు. ఆయా గ్రామాల్లోని ప్రజల ఇళ్లన్నీ పరసలకు విచ్చేసే బంధుమిత్రులతో కళకళలాడుతూ సందడిగా కనిపిస్తాయి. ఆలయ సమీపాల్లోని రోడ్లకు ఇరుపక్కలా వివిధ రకాల దుకాణాలను ఏర్పాటు చేసి వస్తు సామగ్రి, చిన్నారుల ఆట వస్తువులను విక్రయిస్తారు. రంగులరాట్నాలను ఏర్పాటు చేయడంతో పాటు పలు రకాల తినుబండారాలను అమ్ముతారు. మరోపక్క రాత్రి పది గంటల వరకు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తారు కాబట్టి అందరూ ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడుపుతారు.



ఈ నెల 26న పరస జరగనున్న కొత్తపాలెంలోని పరదేశమ్మ అమ్మవారి ఆలయం

ఘనంగా రామాలయ తీర్థం

గోపాలపట్నం: ఇక్కడి వెంకటాపురంలో సీతారాముల పరసను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించగా, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి సీతారాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం గ్రామంలో పరస సందడిగా సాగింది.



ఆలయంలో పూజలు అందుకున్న సీతారాములు

పెందుర్తి పరిసరాల్లో వరుస చోరీలతో బెంబేలు

- తాళాలువేసిన ఇళ్లే టార్గెట్
- గొలుసు దొంగతనాల జోరు

పెందుర్తి, జనవరి 17: పెందుర్తి పరిసరాల్లో దొంగలు విజృంభిస్తున్నారు. వరుసచోరీలతో పోలీసులకు సవాల్ విసురుతున్నారు. తాళాలు వేసిన ఇళ్లను లూటీ చేస్తున్నారు. మహిళల మెడల్లో చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారు. సంక్రాంతి పండగ కోసం పెందుర్తిలోని ఓ కుటుంబం మంగళవారం అరకు వెళ్లింది. మంగళవారం ఆ ఇంటి తలుపులు పగలుగొట్టి 10 తులాల బంగారం.. 50 వేల నగదు అప హరించుకుపోయారు. నెలరోజుల క్రితం చినముషిడివాడలో వుడాకాలనీలో తాళం వేసిన ఇంటి కిటికీ గ్రిల్ విరిచి కిలో వెండి, రూ. 50 వేలు ఇటీవల దోచుకున్నారు. ఇదిలాఉండగా, ఆటోల్లో ప్రయాణిస్తున్న మహిళలు బ్యాగుల్లోంచి లక్ష్మీపురం, వేపగుంట జరిగిన వేర్వే రుగా జరిగిన రెండు సంఘటనల్లో 18తులాల బంగారం అపహరించారు. సరిపల్లి, జంగాలపాలెంలో కొద్దిరోజుల కిందట 8 తులాలు బంగారం చైన్‌స్నాచ్ చేశారు. చోరీలు జరిగిన సమయంలో పోలీసులు జాగిలాలు, క్లూస్ టీంలతో హడావుడి చేస్తున్నా.. కేసు దర్యాప్తులో పురోగతి కానరాకపోవడంతో బాధితులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ క్రమంలో ఇటీవల స్థానిక స్టేషన్ క్రైమ్ ఎస్ఐగా ఉన్న సల్మాన్‌బేగ్‌ను చోరీ కేసు దర్యాప్తుల్లో అవినీతి పాల్పడ్డారని ఆరోపణలు రావటంతో ఆమె వీఆర్‌కు సరెండర్ చేయడం స్థానికంగా పోలీసు వర్గాల్లో కలకలం రేగింది. దొంగలు పట్టుకోవాల్సిన పోలీసులు అవినీతికి పాల్పడటంపై పోలీసు శాఖలో చర్చనీయమైంది.

క్రైమ్ సిబ్బంది కొరత

పెందుర్తి నేర విభాగ పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ ఎస్ఐ ఒక్కరే ఉండడం.. సిబ్బంది కొరతతో చోరీల నియంత్రణలో సమస్యలు తలెత్తుతున్నాయి. ఇక్కడి సీఐ పోస్టు తప్పించి, జోన్‌గా మాత్రమే పరిగణించి కంచరపాలెం సర్కిల్ పరిధిలో ఈస్టేషన్ (పెందుర్తి పోలీస్ క్రైమ్ స్టేషన్) చేర్చారు. దీంతో జోనల్ స్టేషన్ కావడంతో అక్కడి క్రైమ్ సీఐ ఇక్కడి (పెందుర్తి) క్రైమ్ పోలీస్ స్టేషన్‌ను పర్యవేక్షిస్తున్నారు. దీంతో స్థానికంగా క్రైమ్ ఎస్ఐ ఒక్కరే స్టేషన్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. నలుగురు హెడ్ కానిస్టేబుల్స్ ఆరుగురు పోలీసులున్నారు.

వీరిలో ముగ్గురికి శాఖపరమైన ఇతర డ్యూటీలు వేస్తున్నారు. నేర విభాగ పోలీసులు సిబ్బంది కొరతతో రాత్రిపూట పోలీసుల గస్తీల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో పట్టపగలు దొంగలు ఇళ్లల్లోకి ప్రవేశించి చోరీలకు పాల్పడుతుండటం సంచలనం రేపుతోంది. పోలీసు ఉన్నతాధికారులు చోరీలపై దృష్టి సారించాల్సి ఉంది. అలాగే, చోరీ కేసులో నిందితులను పట్టుకుని సొత్తును రికవరీచేసి న్యాయం చేయాలని బాధితులు విజ్ఞప్తిచేస్తున్నారు.



చోరీకి లోనైన ఇంట్లో చిందరవందరగా ఉన్న వస్తువులు (ఫైల్)



బోసిపోయిన జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయం



సిబ్బంది లేక ఖాళీగా ఉన్న జోనల్ ఇంజనీరింగ్ కార్యాలయం

కళ తప్పిన పారిశ్రామిక ప్రాంతం

వెలవెలబోయిన ప్రభుత్వ కార్యాలయాలు

గాజువాక, జనవరి 17: సంక్రాంతి పండక్కి సొంతూళ్లకు వెళ్లిన ప్రజలు తిరిగి చేరుకోకపోవడంతో బుధవారం పారిశ్రామిక ప్రాంతం బోసిపోయింది. ప్రభుత్వ కార్యాలయాలు తెరుచుకున్నప్పటికీ పూర్తి స్థాయిలో సిబ్బంది హాజరు కాకపోవడంతో వెలవెలబోతూ దర్శనమిచ్చాయి. ప్రజల తాకిడి కూడా ఆయా కార్యాలయాల వద్ద కనిపించలేదు. దీంతో ప్రభుత్వ కార్యాలయాలు ఖాళీగా దర్శనమిచ్చాయి. కొంతమంది సిబ్బంది విధులకు హాజరైనా, మధ్యాహ్నం నుంచి చాలా మంది ఇళ్లకు వెళ్లిపోయారు. గాజువాకలోని వీధులు కూడా జనసంచారం లేక బోసిపోయాయి. చాలా దుకాణాలను తెరవలేదు. మరో రెండు రోజులు పాటు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉంది. కాగా ఆర్టీసీ బస్సులు పూర్తి స్థాయిలో నడవలేదు. కొద్దిపాటి ఆటోలు మాత్రమే అక్కడక్కడ కనిపించాయి.

వైసీపీ 70వ వార్డు అధ్యక్షుడి రాజీనామా

వందమందితో జనసేన పార్టీలో చేరిక

కండువాలు వేసి ఆహ్వానించిన కోన తాతారావు

ఆటోనగర్, జనవరి 17: వైసీపీ 70వ వార్డు అధ్యక్షుడు కేవీ సూరిబాబు ఆధ్వర్యంలో సుమారు వందమంది నాయకులు, కార్యకర్తలు బుధవారం జనసేన పార్టీలో చేరారు. వారికి జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు పార్టీ కండువాలు ఆహ్వానించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో పనిచేస్తున్నా సరైన గుర్తింపు లేకపోవడంతో పాటు ఆశించిన స్థాయిలో అభివృద్ధి పనులు జరగకపోవడంతో వైసీపీకి తాము రాజీనామా చేసి జనసేనలో చేరామన్నారు. రానున్న ఎన్నికల్లో జనసేన-టీడీపీ ఉమ్మడి ప్రభుత్వం రావడం ఖాయమన్నారు. జనసేన 70వ వార్డు అధ్యక్షురాలు లంకల మురళీదేవి సమక్షంలో వారు ఆ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, ఎస్.అప్పారావు, తుంపాల చిరంజీవి, నరసింగరావు, గోవింద్, జోజి, సత్తిరాజు, తదితరులు పాల్గొన్నారు.



కోన తాతారావు ఆధ్వర్యంలో జనసేనలో చేరిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు

టీడీపీ విశాఖ పార్లమెంట్ లీగల్ సెల్ అధ్యక్షుడు కేవీ స్వామికి నివాళి

గాజువాక, జనవరి 17: తెలుగుదేశం పార్టీ విశాఖ పార్లమెంట్ లీగల్ సెల్ అధ్యక్షుడు, గాజువాక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీ స్వామి సంతాప సభను బుధవారం గాజువాక జగ్గు జంక్షన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కేవీ స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆకస్మికంగా కేవీ స్వామి మృతి చెందడం టీడీపీకి తీరని లోటని పేర్కొన్నారు. నివాళులు అర్పించిన మాజీ మంత్రులు, టీడీపీ సీనియర్ నేతలు చింతకాయల అయ్యన్నపాత్రుడు, బండారు సత్యనారాయణ మూర్తి, ఎమ్మెల్యే గణబాబు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షుడు పోసాని వెంకటేశ్వర్లు, ప్రతినిధులు శోభన్‌బాబు, దుద్దల కోటేశ్వరరావు, పారా కిశోర్, దేవీ రేవతి, హరిబాబు, కార్పొరేటర్లు స్టాలిన్, బొండా జగన్, న్యాయవాదులు వెన్నెల ఈశ్వరరావు, రోయ్య విశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు.



సంతాప సభలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

'మంత్రి అమర్ మూల్యం చెల్లించక తప్పదు'

పెందుర్తి, జనవరి 17: మంత్రి గుడివాడ అమర్నాథ్ నోరు అదుపులో పెట్టుకోపోతే మూల్యం చెల్లించక తప్పదని జిల్లా కాంగ్రెస్ నేత వేగి దివాకర్ హెచ్చరించారు. పీసీసీ నూతన అధ్యక్షురాలిగా షర్మిల బాధ్యతలు అప్పగించిన నేపథ్యంలో మంత్రి అమర్నాథ్ రాష్ట్రంలో ఉనికిలేని పార్టీపై ఎవరు అధ్యక్షుడు అయితే ఏం ప్రయోజనం అంటూ చేసిన వ్యాఖ్యలపై దివాకర్ స్పందించారు. పెందుర్తిలో పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ, వందేళ్ల చరిత గల కాంగ్రెస్ పార్టీని విమర్శించే స్థాయి అమర్నాథ్‌కు లేదన్నారు. అమర్ తాత, తండ్రి గుడివాడ అప్పన్న గురునాథరావులకురాజకీయ భవిష్యత్తు కల్పించింది కాంగ్రెస్ అని గుర్తు చేశారు. రెండు నెలల్లో వైసీపీ పరాజయం ఖాయమన్నారు. ఆ తర్వాతఅమర్‌నాథ్ అడ్రస్ గల్లంతు అవుతుందని ఆరోపించారు.

పెందుర్తి తెలుగు యువత కార్యదర్శిగా పైడిరాజు

వేపగుంట జనవరి 17: జీవీఎంసీ 93వ వార్డుకు చెందిన కర్రి పైడిరాజు (గాంధీ)ని పెందుర్తి తెలుగు యువత ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. పరవాడ కార్యాలయంలో అనకాపల్లి తెలుగు యువత పార్లమెంట్ అధ్యక్షుడు బుచ్చిరాజు బుధవారం ఈ నియామక ఉత్తర్వులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ, తనపై ఉంచిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. తనకు పదవి రావడానికి సహకరించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు అప్పలనాయుడు, వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా పార్లమెంటు అధ్యక్షుడు బుచ్చిరాజును ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

పెందుర్తిరూరల్, జనవరి 17: గ్రేటర్ 95వ వార్డు పరిధి చీమలాపలిసచివాలయం వద్ద బుధవారం ఏర్పాటుచేసిన రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంను స్థానిక కార్పొరేటరు ముమ్మన దేముడు ప్రారంభించారు. వైద్యాధికారి లక్ష్మి, వైసీపీ నాయకులు ఎర్రయ్య సంతోష్, అప్పారావు, రాము, పరదేశి నాయుడు, చిన్నారావు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో నాయకులు, అగనంపూడి పోరాట కమిటీ మహిళలు

స్టీల్‌ప్లాంటును ప్రైవేటీకరిస్తే ఎలా బతకాలి

ఏఐటీయూసి జాతీయ ఉపాధ్యక్షుడు ఆదినారాయణ

కూర్మన్నపాలెం, జనవరి 17: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరిగితే దాన్నే నమ్ముకుని బతుకుతున్న వేలాది కుటుంబాలు ఎలా జీవనం సాగించాలని ఏఐటీయూసి జాతీయ ఉపాధ్యక్షుడు, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఉక్కు పరిరక్షణ కోసం కార్మికులంతా గొంతెత్తి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 1,070వ రోజుకు చేరాయి. దీక్షల్లో కూర్చున్న కార్మికులకు అగనంపూడి పోరాట కమిటీ మహిళలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలు దేశాన్ని తిరోగమనం వైపు నడిపిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకుడు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతీక అయిన స్టీల్‌ప్లాంట్ జోలికొస్తే సహించేది లేదన్నారు. విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించకుండా అప్పుల ఊబిలోకి కేంద్రం నెట్టడం దారుణమని మండిపడ్డారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

నేడు ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరం

గాజువాక, జనవరి 17: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు దివంగత నందమూరి తారక రామారావు వర్ధంతిని గురువారం గాజువాక నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో ఘనంగా నిర్వహిస్తామని టీడీపీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందులో భాగంగా పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. అలాగే పలు సేవా కార్యక్రమాలను చూపడతామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు వెంకటరావు, శివప్రసాద్, పోలరాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



..మాట్లాడుతున్న ప్రసాదుల శ్రీనివాస్

'వర్ధంతి' కార్యక్రమాలకు అధిక సంఖ్యలో తరలిరావాలి

పెదగంట్యాడ: టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీ రామారావు వర్ధంతిని పురస్కరించుకుని గురువారం సీతానగరం ఎన్టీఆర్ కూడలిలో నిర్వహించే కార్యక్రమానికి పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో తరలిరావాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి కోరారు. పార్టీ మండల కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి పేదల అభ్యున్నతి కోసం పనిచేస్తుందని, ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి టీడీపీని మళ్లీ అధికారంలోకి తెచ్చేందుకు అందరూ కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు నమ్మి అప్పారావు, ఎం.పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌ను స్మరించుకోవడం అందరి బాధ్యత

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్

కూర్మన్నపాలెం, జనవరి 17: ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పునాదులు వేసిన మహనీయుడు టీడీపీ వ్యవస్థాపకులు దివంగత ఎన్టీ రామారావు అని, ఆయన జ్ఞాపకాలను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా గురువారం 87వ వార్డులో నిర్వహించిన క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పేద ప్రజల కోసం టీడీపీ ఎన్నో సంక్షేమ పథకాలను పెట్టిందన్నారు. క్రీడా పోటీల విజేతలకు గురువారం బహుమతులను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు ఎస్ఎస్ విజయ రామరాజు, బి.రాజన్ రాజు, ఎస్.కనకరాజు, కె.శ్రీనివాసవర్మ, భాగ్యలక్ష్మి, సాయివర్మ, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న బొండా జగన్

పెదమడకలో వైభవంగా సీతారాముల పరస

అగనంపూడి, జనవరి 17: జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక రామాలయం వద్ద బుధవారం సీతారాముల పరసను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే అధిక సంఖ్యలో భక్తులు సీతారాములను దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పరసను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటాలు, తప్పెటగుళ్లు, సాముగారిడీలు, బొమ్మలకొలువు వంటివి అందరినీ ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే దిబ్బపాలెం రామాలయం వద్ద సాయంత్రం పరస ఉత్సవాన్ని జరిపారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

తుంగ్లాంలో విజయరాఘవస్వామి..

అక్కిరెడ్డిపాలెం: తుంగ్లాం పరిసర ప్రాంతాల ఆరాధ్య దైవం విజయరాఘవస్వామి పరసను వైభవంగా జరిపారు. వేకువజాము నుంచే ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారికి పూజలు చేశారు. సాయంత్రం ఆలయం వద్ద జరిగిన పరసలో కోలాటం, తప్పెటగుళ్లు, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అమితంగా ఆకట్టుకున్నాయి. ఏటా మాదిరిగానే నిర్వహించిన కాకి కుంచారావు స్మారక ముగ్గుల పోటీలకు మహిళల నుంచి మంచి స్పందన వచ్చింది. విజేతలకు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డితో పాటు ఉత్సవ కమిటీ నాయకులు బహుమతులు అందజేశారు.

ప్రభుత్వానికి కక్ష సాధింపు వైఖరి తగదు

- షోకాజ్ నోటీసుల జారీపై అంగన్‌వాడీల నిరసన



షోకాజ్ నోటీసులతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

పెందుర్తి, జనవరి 17: ప్రభుత్వ పొందుపరిచిన విధులు, బాధ్యతలను విస్మరించలేదని అంగన్‌వాడీలు ప్రభుత్వానికి స్పష్టంచేశారు. సీడీపీవో జారీ చేసిన నోటీసులపై అంగన్‌వాడీలు బుధవారం నిరసన వక్తం చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నెలరోజులకు పైగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా వ్యవహరించడం దారుణమన్నారు. పండగ వేళ పస్తులతో శిబిరాల్లో పడిగాపులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ బాధ్యతలు విస్మరిస్తున్నారని సీడీపీవో జారీ చేసిన షోకాజ్ నోటీసులకు వివరణ ఇచ్చారు. అనంతరం సీడీపీవో కార్యాలయంలో సమాధాన వివరణ పత్రులు సమర్పించారు, ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. దేవి, ఎఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.అనిత, జిల్లా అధ్యక్షురాలు బృంద, దేవి. లక్ష్మి, అన్నపూర్ణ పాల్గొన్నారు.

ముత్యాలమ్మ జాతర మహోత్సవం

వేపగుంట జనవరి 17: వేపగుంట పరిసర గ్రామాల ఆరాధ్యదైవం ముత్యాలమ్మ పరస మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగాఅమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పంచామృతాభిషేకం, అర్చనలు చేశారు. ఈ ఉత్సవాల్లో బుర్రకథ, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

బాల రాముడి వర్ణ చిత్రాల పోటీలకు ఆహ్వానం

డాబాగార్డెన్స్, జనవరి 17: అయోధ్యలో రామాలయం ప్రారంభానికి సిద్ధమైన శుభ తరుణంలో చిన్నారులను ఈ సంబరాల్లో భాగస్వామ్యం చేయాలని వేద విజ్ఞాన సమితి సంకల్పించినట్టు ప్రముఖ చిత్రకారులు నుదురుపాటి అప్పలనరసయ్య తెలిపారు. ఈ నేపథ్యంలో బాల రాముడి వర్ణ చిత్రాల పోటీ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మొదటి ముగ్గురు విజేతలకు రూ.1,116 బహుమతిగా అందించడంతోపాటు పాల్గొన్న వారందరికీ శ్రీరాముని ఆశీస్సులతో కూడిన ప్రశంసా పత్రాలను పంపిణీ చేస్తామన్నారు. 6 నుంచి 15 సంవత్సరాల మధ్య వయసు గల పిల్లలు ఎవరైనా ఏ ప్రాంతం నుంచైనా వారి ఇంట్లోనుంచే ఈపోటీలలో పాల్గొనవచ్చునని తెలిపారు. బాలరాముడు ప్రధాన అంశంగా వేసిన ఒక వర్ణ చిత్రాన్ని వేయాలన్నారు. పేరు, ఊరు, చదువుతున్న తరగతి, వర్ణ చి త్రం ఫొటో తీసి ఈ నెల 21వ తేదీలోపు 81256 74182 నంబరుకు వాట్సప్ ద్వారా పంపాలన్నారు. విజేతలను ఈ నెల 22న ప్రకటిస్తామన్నారు.

విద్యార్థినికి సత్కారం



రిషికను సత్కరిస్తున్న కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జిత్

అక్కయ్యపాలెం, జనవరి 17: న్యూఢిల్లీలో ఎన్‌సీఈఆర్‌టీ నిర్వహించిన జాతీయ స్థాయి కళా ఉత్సవ్ 2024 సాంస్కృతిక పోటీల్లో తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న జి. రిషిక క్లాసికల్ డ్యాన్స్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచింది.ఈ మేరకు ఆమెకు విద్యా మంత్రి, కేవీఎస్ కమిషనర్, ఎన్‌సీఈఆర్‌టీ ఉన్నత అధికారుల నుంచి ఢిల్లీలో సత్కారాలు అందుకుంది. ఈ నేపథ్యంలో రిషికను బుధవారం కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్ కమల్‌జిత్, ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. సంగీత ఉపాధ్యాయుడు డాక్టర్ త్యాగరాజ్ ద్వారంను అభినందించారు. అలాగే రిషికకు గణతంత్ర దినోత్సవ వేడుకలకు హాజరుకావాలని ఆహ్వానం అందింది.

బ్రహ్మా బాబా స్మృతి దినోత్సవం..

డాబాగార్డెన్స్, జనవరి 17: ప్రజాపిత బ్రహ్మాకుమారీస్ సంస్థ స్థాపించిన బ్రహ్మా బాబా 55వ అవ్యక్త స్మృతి దినోత్సవం, ప్రపంచ శాంతి దినోత్సవాలను బ్రహ్మా కుమారీస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన ఈ వేడుకల్లో బ్రహ్మాకుమారీస్ ప్రతినిధి రామేశ్వరీ తదితరులు పాల్గొన్నారు. మానసిక ఒత్తిడి నుంచి బ్రహ్మాకుమారీ బోధనలు ద్వారా విముక్తి లభిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రతినిధులు బీకే శివలీల, శశికళ, సత్యవతి, బీకే వేణి, వీరభద్రరావు పాల్గొన్నారు.

20న రౌండ్ టేబుల్ సమావేశం

డాబాగార్డెన్స్, జనవరి 17: రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరం ఆంధ్రప్రదేశ్, వైజాగ్ ఎన్జీవో ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 20న ఎంవీపీ కాలనీలో ఎస్‌వీవీపీ డిగ్రీ కళాశాలలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు నరవ ప్రకాశరావు తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ పార్టీలు పిల్లల కోసం ఏం చేస్తాయో ప్రకటించాలని అని కోరుతూ ఈ సమావేశం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఉత్సాహమైన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కోరారు.

వ్యక్తి ఆత్మహత్య



ఉరేసుకున్న రాజు

సీతంపేట, జనవరి 17: నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ముస్లింతాటిచెట్లపాలెం ఆక్కయ్యపాలెం అబీద్‌నగరకి చెందిన పొదులాపు రాజు (40) స్క్రాప్ దుకాణంలో పని చేస్తుంటారు. ఆయన మంగళవారం రాత్రి ఇరుగుపొరుగునున్న ఓ ఇంటికి వెళ్లి మహిళతో మాట్లాడాడు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు వచ్చి రాజును మందలించారు. దీంతో మనస్తాపం చెందిన రాజు ఇంట్లో ఉండిపోయాడు. ఈ క్రమంలో బుధవారం తన కుమారుడిని బయటకు ఏదో పనిచూపి బయటకు వెళ్లామన్నాడు. అనంతరం ఇంట్లో పైకప్పుకు ఉన్న రాడ్డుకి చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటికి వచ్చిన అతని భార్య తలుపులు కొట్టినా, తలుపులు తీయకపోవడంతో స్థానికులతో చెప్పి పోలీసులకు సమాచారమందించారు. దీంతో పోలీసులు వచ్చిచూసేసరికి రాజు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపడుతున్నారు.

వైద్యునిపై నర్సింగ్ సిబ్బంది ఫిర్యాదు

మహారాణిపేట, జనవరి 17: కేజీహెచ్ పిడియాట్రిక్ విభాగంలో వైద్యుడు వార్డులో నర్సింగ్ సిబ్బందిపై చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ అశోక్‌కుమార్‌కు వారు ఫిర్యాదు చేశారు. బుధవారం ఉదయం పిల్లల వార్డులో వైద్యుడు విధుల్లోఉన్ననర్సింగ్ చేపడుతున్న సేవలపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ కొన్ని వ్యాఖ్యలు చేశారు. దీంతో నర్సింగ్ సిబ్బంది నిరసనవ్యక్తంచేస్తూ ఫిర్యాదుచేశారు. ఈ ఘట నపై విచారణ చేయనున్నట్టు సూపరింటెండెంట్ తెలిపారు.

భక్తులకు వారధిగా 'భవదీయం'



సంస్థ ప్రారంభోత్సవంలో నిర్వాహకులు

మురళీనగర్, జనవరి 17 ; ఉత్తర నియోజకవర్గంలోని 50వ వార్డు మురళీనగర్‌లో బుధవారం దేవాలయాలకు అనుబంధంగా భవదీయం అనే స్వచ్ఛంద సంస్థను ఆరంభించారు. దేశంలో ప్రముఖ దేవాలయాల్లో సేవల కోసం వెళ్లే సేవకులను పంపించనున్నట్టు ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు రవికుమార్, కార్యదర్శి సుగుణకుమారి తెలిపారు. ఆలయాల్లో సేవకులు, కోలాటం బృందాలు, సాంస్కృతిక సేవల కోసం వెళ్లే వారికి తగిన ప్లాట్‌ఫాంగా తమ సంస్థ నిలుస్తుందన్నారు.

అసోసియేషన్ పేరిట దందా!

- రైల్వే న్యూకాలనీలో పాఠశాల మైదానం స్వాధీనం
- క్రీడాస్థలాన్ని సొమ్ము చేసుకుంటున్న సభ్యులు
- వాకర్స్ నుంచి నెల వారీ వసూళ్లు
- చెల్లించకుంటే అనుమతి నిరాకరణ
- చిన్నారులకూ నో ఎంట్రీ
- దృష్టి సారించని జీవీఎంసీ యంత్రాంగం



రైల్వే న్యూకాలనీలోని కేవీఎం పాఠశాల



ఫీజు వసూలు చేసేందుకు గేటు ఎదురుగా కూర్చున్న సభ్యుడు

అక్కయ్యపాలెం, జనవరి 17:

విద్యార్థుల ఆటల కోసం వినియోగించాల్సిన మైదానాన్ని అసోసియేషన్ పేరిట కొంతమంది స్వాధీనం చేసుకుని, స్వప్రయోజనాలకు వాడుకుంటున్నారు. వాకర్స్ నుంచి నెలవారీ వసూళ్లు చేపడుతున్నారు. చిన్నారులకు ప్రవేశం కల్పించడం లేదు. డబ్బు చెల్లించకుంటే ఎవరికీ ప్రవేశం లేకుండా చేస్తున్నారు. ఇందుకోసం ఓ వ్యక్తిని నియమించి మరీ దందా కొనసాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా జీవీఎంసీ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

గ్రేటర్ 42వ వార్డు రైల్వేన్యూకాలనీలోని కమలా నెహ్రూ మునిసిపల్ (కేవీఎం) బాలికోన్నత పాఠశాల, జీవీఎంసీ ఉన్నత పాఠశాలల మైదానాన్ని రైల్వే న్యూకాలనీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు తమ స్వాధీనంలో ఉంచుకున్నారు. ఇక్కడకు ఉదయపు నడక కోసం వచ్చే వాకర్స్ నుంచి నెలవారీ ఫీజులు వసూలు చేస్తున్నారు. ఈ మైదానంలో ఉదయం, సాయంత్రం వాకింగ్ చేయాలంటే నెలకు రూ.100 చెల్లించాలని, లేదంటే అనుమతి లేదని తెగేసి చెబుతుండడంతో వాకర్స్ అవాక్కవుతున్నారు. కొంత స్థలంలో వాకింగ్ ట్రాక్, మెడిటేషన్ సెంటర్ ఏర్పాటు చేసి అందులో ఓవైపు బుద్ధుడి విగ్రహం, మరోవైపు అసోసియేషన్ కార్యాలయం నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాల మైదానంలో జీవీఎంసీ ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసింది. దీనిని కూడా అసోసియేషన్ సభ్యులు స్వాధీనం చేసుకున్నారు. ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకు మాత్రమే తెరచి ఉంచి, ఆ తర్వాత మూసేస్తారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 8 వరకు అనుమతిస్తున్నారు. ఈ ఓపెన్ జిమ్‌లో ప్రవేశాలకు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కూడా అవకాశం కల్పించడంలేదు. అసలు వీరికి ఈ స్థలాన్ని ఎవరు కేటాయించారో తెలియని విచిత్ర పరిస్థితి నెలకొంది.

బాస్కెట్ బాల్ శిక్షణకు అడ్వాన్స్ రూ.2వేలు

అదే విధంగా బాస్కట్ బాల్ శిక్షణకు అడ్వాన్స్ రూ.2వేలు చెల్లించాలి. నెలకు రూ.500 చొప్పున కట్టాలి. కరాటే నేర్చుకోవడానికి కూడా అదే పరిస్థితి. స్కూల్ ఆవరణలో సగం స్థలాన్ని అసోసియేషన్ సభ్యులు సొమ్ము చేసుకుంటున్నారు.

ఇరుకు గదుల్లో విద్యార్థులు

కేవీఎం బాలికోన్నత పాఠశాలలో 370 మంది విద్యార్థినులు, జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో 308 మంది విద్యార్థులున్నారు. వీరికి తరగతి గదులు తక్కువగా ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరండాల్లో తరగతులు నిర్వహించాల్సి వస్తోంది. పాఠశాల ఆవరణలో ఉన్న మరుగుదొడ్లను స్టోర్ రూమ్‌గా వినియోగించాల్సిన దుస్థితి. అసోసియేషన్ ధ్యానమందిరం, ఆఫీస్ రూమ్, వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేపట్టిన స్థలంలో పిల్లలకు ఉపయోగపడేలా పలు నిర్మాణాలు చేపట్టే వీలుందని విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. ఈ దందాపై జీవీఎంసీ కమిషనర్ స్పందించి అసోసియేషన్ సభ్యుల స్వాధీనంలో ఉన్న పాఠశాలల మైదానం విద్యార్థులకు ఉపయోగపడేలా చేయడంతోపాటు ఖాళీ స్థలంలో తరగతి గదులను నిర్మించాలని కోరుతున్నారు.

అబిద్‌నగర్ పార్కులోనూ వసూళ్లు..

గ్రేటర్ 44వ వార్డు అబిద్‌నగర్‌లో ఏర్పాటుచేసిన పిల్లల పార్కులో ఆడుకోవాలంటే డబ్బులు చెల్లించాల్సిందేనని నిర్వాహకులు చెబుతున్నారు. వారానికొకసారి వెళ్లినా వారినుంచి కూడా ముక్కుపిండి మరీ డబ్బు వసూలు చేస్తున్నారు. డబ్బులు లేకుండా వెళ్లి ఊయల ఊగినా, జారుడు బల్ల జారినా, ఆడుకున్నా వాచ్‌మన్ వచ్చి తరిమేస్తాడు. సెలవుల్లో సరదాగా పార్కుకు వెళ్లి ఆడుకుందామనుకునే వారికి దడ పుట్టిస్తున్నారు. తల్లిదండ్రులు ఇస్తున్న పాకెట్ మనీ పార్కు వారికే చెల్లించాల్సి వస్తోందని పిల్లలు వాపోతున్నారు. జీవీఎంసీ ఏర్పాటు చేసిన పార్కుల్లోకి డబ్బులు వసూలు చేయడమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఫిర్యాదు అందలేదు

పాఠశాల మైదానంలో వాకర్స్ నుంచి అసోసియేషన్ సభ్యులు డబ్బు వసూలు చేస్తున్నట్లు లిఖిత పూర్వకంగా ఎటువంటి ఫిర్యాదు అందలేదు. పాఠశాల ఆవరణ, మైదానంలో అనుమతి లేకుండా ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించకూడదు. మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన అన్నింటినీ పరిశీలించి, చర్యలు తీసుకుంటాం.

\- శ్రీనివాస్, డీడీఈవో, జీవీఎంసీ విద్యా విభాగం



ఓపెన్ జిమ్‌కు తాళాలు వేసిన దృశ్యం



వాకింగ్ ట్రాక్

ముగిసిన మార్వాడి క్రికెట్ పోటీలు



విజేత జట్టు ఆశ పోరాతో ముఖ్య అతిథి ఐజీ రాజీవ్ కుమార్ మీనా

విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 17: వాల్తేరు రైల్వే క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన మార్వాడీ క్రికెట్ లీగ్ చాంపియన్‌షిప్ టోర్నీ బుధవారం ముగిసింది. ఫైనల్స్‌లో విజయం సాధించి చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకున్న ఆశ పోరా జట్టు ట్రోఫీతోపాటు రూ.41వేలు బహుమతి, రన్నరప్‌గా నిలిచిన మహాకాళి ఎలెవన్ జట్టు రూ.31 వేలు నగదు బహుమతి అందుకున్నాయి. టోర్నీ ముగింపు కార్యక్రమానికి గ్రేహౌండ్స్ ఐజీ రాజీవ్‌కుమార్ మీనా ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అభినందించారు. ఈ కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు హర్ష పగాడియా తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లు అరెస్టు

సీతంపేట, జనవరి 17: నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ తాటిచెట్లపాలెం ప్రాం తంలో బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్న వారిపై సీఐ విజయకుమార్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ సూర్యారావు సిబ్బందితో దాడి చేశారు. నలుగురు వ్యక్తులను అదుపులో తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 27,650 స్వాధీనం చేసుకున్నారు. మరి కొందరు పరారయ్యారు. వారి కోసం గాలిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

వాల్తేరు డివిజన్‌కు ఐదు పురస్కారాలు



తూ.కో రైల్వే జీఎం నుంచిఅవార్డునందుకుంటున్న దృశ్యం

విశాఖపట్నం, జనవరి 17: రైల్వే అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న వాల్తేరు డివిజన్‌కు ఐదు ఉత్తమ ప్రతిభా పురస్కారాలు లభించాయి. తూర్పుకోస్తారైల్వే పరిధిలోని మేజర్ స్టేషన్ కేటగిరిలో శ్రీకాకుళం రోడ్డు స్టేషన్‌కు ఉత్తమ పరిశుభ్రత స్టేషన్ అవార్డుతోపాటు ఎలక్ట్రికల్, సిగ్నిల్ అండ్ టెలికాం శాఖల కు ఉత్త మ పనితీరుకు షీల్డ్‌లు లభించాయి. అలాగే ఆపరేటింగ్, సర్వే అండ్ కన్‌స్ట్రక్షన్ శాఖలకు సంబంధించి కుర్దా డివిజన్‌తో కలిసి మరో రెండు అవార్డులను పొం దింది. బుధవారం భువనేశ్వర్‌లో జరిగిన 68వ రైల్వే వారోత్సవాలలో తూర్పు కోస్తారైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ చేతుల మీదుగా వాల్తేరు డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరబ్‌ప్రసాద్ ఆయా శాఖలకు చెందిన అధికారులతో కలిసి ఈ అవార్డులందుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్తేరు డివిజన్ అభివృద్ధికి చిత్తశుద్ధితో సేవలందిస్తున్న అధికారులు, సిబ్బందిని అభినందించారు.

ఎమ్మెల్యే వాసుపల్లి చర్యలతో ప్రజాస్వామ్యం ఖూనీ

- విద్యా సంస్థలో మద్యం పంపిణీపై చర్యలు తీసుకోవాలి
- 'దక్షిణ' జనసేన పార్టీ నాయకులు మూగి శ్రీనివాసరావు డిమాండ్

సీతంపేట, జనవరి 17: విశాఖ దక్షిణ నియోజకవర్గ వైసీపీ షాడో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పవిత్రమైన విద్యా సంస్థలో సంక్రాంతి సందర్భంగా వైసీపీ కార్యకర్తలకు మద్యం, కోడి గుడ్లు పంపిణీ చేయడం దారుణమని, ఈ సంఘటనతో ఆయన ప్రజాస్వామ్యాన్ని పట్టపగలే ఖూనీ చేసినట్లయిందని విశాఖ దక్షిణ నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు డాక్టర్ మూగి శ్రీనివాసరావు విమర్శించారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాసంస్థలో మద్యం పంపిణీ నేపథ్యంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌పై ఎక్సైజ్ చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. దీంతోపాటు విద్య సంస్థలో ఈ పంపిణీలో పాల్గొన్న కార్యకర్తలపైనా చర్యలు తీసుకోవాలన్నారు. మద్యపానం నిషేధం విధిస్తామన్ని చెప్పిన వైసీపీ మద్యపాన నిషేధం చాతకాకపోవడంతోపాటు ఇలా యథేచ్ఛగా మద్యం పంపిణీ చేయడం ప్రజలకు ఎటువంటి సంకేతాలనిస్తోందో అర్థమవుతుందన్నారు. వాసుపల్లి గణేష్ కుమార్ ప్రజల్లోకి వచ్చేటప్పుడు మద్యం తాగివస్తున్నారని, కార్యకర్తలకి మద్యం బాటిల్ పబ్లిక్‌గానే సరఫరా చేస్తున్నారని ఆధారాలు మీడియాలో దొరికిన తర్వాత కూడా ప్రభుత్వం స్పందించక పోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు పీవీ శివప్రసాద్‌రెడ్డి, మహిళా కోఆర్డినేటర్ మైలపల్లి నాగలక్ష్మి, మైలిపిల్లి తాతారావు, ఆంటోని శేఖర్, శ్రవణ్, జక్క వాసుదేవరావు, పద్మనాభం, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మూగి శ్రీనివాసరావు

మిలాన్-2024కు పటిష్ట ఏర్పాట్లు

- వచ్చే నెల 19 నుంచి 27 వరకు రెండు దశలలో నిర్వహణ
- హాజరుకానున్న ఉప రాష్ట్రపతి, కేంద్ర రక్షణ మంత్రి, ముఖ్యమంత్రి
- అధికారుల సమీక్ష సమావేశంలో కలెక్టర్ మల్లికార్జున

విశాఖపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నేవల్ కమాండ్ ఆధ్వర్యంలో విశాఖ కేంద్రంగా వచ్చే నెల 19 నుంచి 27 వరకు రెండుదశలలో జరగనున్న మిలాన్-2024 వేడుకలను విజయవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున కోరారు. వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో బుధవారం నేవీ, ఎయిర్‌పోర్టు, పోర్టు, కస్టమ్స్, రెవెన్యూ, పోలీస్, జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ, పర్యాటక అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయా విభాగాలు చేపట్టాల్సిన చర్యలపై మార్గనిర్దేశం చేశారు. అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. మిలాన్ -2024 ఇన్‌చార్జి, నేవల్ కమాడోర్ నీరజ్ అజాద్ మిలాన్ 12వ ఎడిషన్ కార్యక్రమాలను వివరించారు. వచ్చే నెల 19 నుంచి 23 వరకు హార్బర్ ఫేజ్, 24 నుంచి 27 వరకు సీ(సముద్రం) ఫేజ్ కార్యక్రమాలు జరుగుతాయని, దీనికి దేశ, విదేశాల నుంచి అతిథులు వస్తున్నారన్నారు. ఉప రాష్ట్రపతి, కేంద్ర రక్షణ మంత్రి, రాష్ట్ర ముఖ్య మంత్రి ముఖ్య అతిథులుగా హాజరవుతార న్నారు. 50 విదేశీ నౌకలు, 40 వరకు యుద్ధనౌకలు, సబ్‌మెరైన్లు వేడుకల్లో భాగస్వామ్యమవుతాయన్నారు. వచ్చే నెల 18,19 తేదీల్లో దేశ, విదేశాల నుంచి వచ్చే నౌకలు పోర్టు, నేవల్ డాక్‌యార్డుకు చేరుకుంటాయని, 19న విదేశ ప్రముఖులు నగరానికి వస్తారన్నారు. 21న ప్రధాన కార్యక్రమాలకు కేంద్ర రక్షణమంత్రి హాజరవు తారన్నారు. నేవల్ ఆడిటోరియం సముద్రికలో హార్బర్ ఫేజ్ వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. అదే రోజు సాయంత్రం మిలాన్ విలేజ్‌ను రక్షణమంత్రి ప్రారంభి స్తారని, 22న సముద్రికలో జరిగే ప్రత్యేక కార్యక్ర మానికి ఉప రాష్ట్రపతి హాజరవుతారన్నారు. అదే రోజు సాయంత్రం బీచ్ వేదికగా ప్రధాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హాజరవుతాయని నీరజ్ అజాద్ పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

అనంతరం కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ వేడుకలకు ప్రముఖులు రానున్నందున రక్షణ, బందో బస్తు ఏర్పాట్లు చూడాలని పోలీసులను ఆదేశించారు. వేడుకలు వీక్షించేందుకు బీచ్‌లో బారికేడ్లు, తాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. బీచ్ ఏరియాలో సీసీ కెమెరాలు, ఎల్‌ఈడీలు ఏర్పాటు చేయాలని, ఏపీఐఐసీ, ఏయూ మైదానంలో వాహ నాలకు పార్కింగ్, విశ్వప్రియ ఫంక్షన్‌హాలు, విశాఖ మ్యూజియంలో అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. మిలాన్ జరిగే సమయంలో సముద్రంలో ఎటువంటి కార్యక్రమాలు లేకుండా చూడాలని మత్స్యశాఖ జేడీని ఆదేశించారు. ఎప్పటికప్పుడు నేవీ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. మిలాన్‌లో భాగంగా సిటీ పరేడ్ సందర్భంగా బీచ్‌రోడ్డులో శకటాల ప్రద ర్శన, సాంస్కృతిక ప్రదర్శన ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో తూర్పు నావికాదళానికి చెందిన ఉన్నతాధికారి రాజేష్‌శర్మ, నేవీ కమాండర్లు, డీసీపీ శ్రీనివాసరావు, డీఆర్వో కె.మోహనకుమార్, ఆర్డీవో హుస్సేన్‌సాహెబ్, అధికారులు పాల్గొన్నారు.

బై బై వైసీపీ

... 3వ పేజీ తరువాయి

టీడీపీ 30 వార్డులను గెలుచుకుంది. జనసేన మూడు, సీపీఐ, సీపీఎం, బీజేపీ ఒక్కొక్క వార్డు దక్కించుకున్నాయి. నాలుగుచోట్ల ఇండిపెండెంట్లు గెలిచారు. దీంతో వైసీపీకి చెందిన 11వ వార్డు కార్పొరేటర్ గొలగాని హరివెంకటకుమారిని మేయర్‌గా ఎంపిక చేశారు. దాదాపు మూడేళ్లపాటు జీవీఎంసీ కౌన్సిల్‌లో వైసీపీ ఆధిపత్యానికి అడ్డేలేకుండా పోయింది. జీవీఎంసీకి, నగరవాసులకు ఎంత ఇబ్బంది కలిగించే అంశమైనప్పటికీ సంఖ్యాబలంతో ఏకగ్రీవంగా ఆమోదించుకుంటూ వచ్చారు. వైసీపీ కార్పొరేటర్లలో చాలామంది పార్టీ నేతల తీరు పట్ల అసంతృప్తి ఉన్నప్పటికీ రాష్ట్రంలో అధికారంలో ఉండడంతో బయటపెట్టకుండా వచ్చారు. సాధారణ ఎన్నికలు సమీపిస్తుండడంతో కార్పొరేటర్లలో అసంతృప్తులు ఒక్కొక్కరు బయటపడుతున్నారు. పార్టీలో ఇమడలేమంటూ టీడీపీ, జనసేన పార్టీల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. దక్షిణ నియోజకవర్గం పరిధిలో ఇండిపెండెంట్లుగా గెలిచి వైసీపీలో చేరిన ముగ్గురు కార్పొరేటర్లలో ఇద్దరు ఇటీవలే పార్టీకి గుడ్‌బై చెప్పేశారు. జనసేన పార్టీలో చేరిపోయారు. తాజాగా దక్షిణ నియోజకవర్గానికే చెందిన మరో నలుగురు కార్పొరేటర్లు కూడా పార్టీని వీడాలని దాదాపు నిర్ణయించుకున్నారు. నియోజకవర్గ పరిధిలోని ఎనిమిది మంది కార్పొరేటర్లు రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్ అనుచరులుగా కొనసాగుతున్నారు. సుధాకర్ ఇటీవలే పార్టీని వీడారు. ఆయన తెలుగుదేశం పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. ఈ క్రమంలో 29వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు, 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్‌జైన్, 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకిరామ్‌లు కూడా సుధాకర్ వెంట నడవాలని నిర్ణయించుకున్నారు. బుధవారం సుధాకర్‌తోపాటు నలుగురు కార్పొరేటర్లు దసపల్లా హోటల్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దీంతో వారు కూడా పార్టీని వీడిపోవడం ఖాయమని పార్టీ నేతలు నిర్ధారణకు వచ్చారు. వీరితోపాటు అదే నియోజకవర్గానికి చెందిన మరో నలుగురు కార్పొరేటర్లు, ఉత్తర నియోజకవర్గ పరిధిలోని ఒకరు, పశ్చిమ నియోజకవర్గ పరిధిలో ఒకరు, గాజువాక నియోజకవర్గ పరిధిలోని నలుగురు కార్పొరేటర్లు కూడా పార్టీని వీడిపోవాలని భావిస్తున్నట్టు పార్టీ నేతల్లో చర్చ జరుగుతోంది. వీరంతా పార్టీని వీడిపోతే జీవీఎంసీ కౌన్సిల్‌లో తమ పార్టీ బలం తగ్గిపోతుందని పెద్దలు ఆందోళన చెందుతున్నారు. అదే జరిగితే కౌన్సిల్‌లో పెట్టే అంశాలను ఆమోదించే పరిస్థితి ఉండదని భయపడుతున్నారు.

జనసేనలోకి కొణతాల?

... 3వ పేజీ తరువాయి

జగన్మోహన్‌రెడ్డి వెంట నడిచారు. వైఎస్‌ఆర్ సీపీ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. 2014 ఎన్నికల అనంతరం వైసీపీకి రాజీనామా చేశారు. అప్పటినుంచి ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఉత్తరాంధ్ర సమస్యలను పాలకుల దృష్టికి తీసుకువెళ్లేందుకు యత్నిస్తున్నారు. అయితే వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుమార్తె షర్మిల కాంగ్రెస్ రాష్ట్ర బాధ్యతలు స్వీకరించనున్న నేపథ్యంలో ఆయన అందులో చేరవచ్చుననే ఊహాగానాలు వినిపించాయి. ఈ మేరకు కేవీపీ రామచంద్రరావు చర్చలు జరిపినట్టు కూడా ప్రచారం జరిగింది. అయితే కొణతాల జనసేన వైపు మొగ్గుచూపారు.

వీసీ ప్రసాదరెడ్డే

... 3వ పేజీ తరువాయి

ఎన్ని విమర్శలు వచ్చినా వారు వెనక్కి తగ్గలేదు. 'రెండు రోజులు ఆగండి...సారే మళ్లీ వస్తారు' అంటూ అందరికీ చెప్పుకొచ్చారు. ఇప్పుడు అదే నిజమైంది. ఇది ఎన్నికల సమయం కావడం, ప్రసాదరెడ్డి మళ్లీ వీసీగా రావడంతో ఏయూ రాజకీయ కార్యకలాపాలకు కీలకం కానుంది. ఎన్నికల సంఘం అధికారులు దీనికి ఏ విధంగా అడ్డుకట్ట వేస్తారో చూడాలి.

ఎమ్మెల్యే వాసుపల్లికి షాక్

... 3వ పేజీ తరువాయి

లేకుండా...కళాశాల తరలింపునకు దరఖాస్తు చేయకుండా రాణాప్రతాప్‌నగర్ నుంచి ఆశీల్‌మెట్టకు తరలించడాన్ని ఇంటర్ బోర్డు తప్పుబట్టింది. ఈ మేరకు షోకాజ్ జారీచేస్తూ 15 రోజుల్లో సమాధానం ఇవ్వాలని పేర్కొంది. ఇంకా రూ.2.5 లక్షల జరిమానా విధించింది. పక్షం రోజుల్లో షోకాజ్‌కు సమాధానం ఇవ్వడంతోపాటు రూ.2.5 లక్షల జరిమానా చెల్లించాలని ఆదేశించింది. ఒకవేళ సమాధానం ఇవ్వకపోయినా, జరిమానా చెల్లించకపోయినా ఆ కళాశాలలో చదివే విద్యార్థులను రానున్న పరీక్షలకు అనుమతించే విషయంపై ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకుంటారని ఆర్‌ఐవో సత్యనారాయణ తెలిపారు. కాగా మధురవాడలో ప్రభ జూనియర్ కళాశాలను ఒకచోట నుంచి మరో ప్రాంతానికి అనుమతి లేకుండా తరలించినట్టు గుర్తించడంతో షోకాజ్ జారీ చేశామన్నారు.

కిక్కిరిసిన రైళ్లు

... 3వ పేజీ తరువాయి

ప్రత్యేక వారాంతపు రైలు (08579)కు, 24, 25 తేదీల్లో జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు, 25న దురంతో ఎక్స్‌ప్రెస్‌కు, 26న విశాఖ-మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌లకు బెర్తులు అందుబాటులో ఉన్నాయి.

చెన్నై రైళ్ల పరిస్థితి ఇదీ..

చెన్నై రైళ్లలో ఈ నెలాఖరు వరకూ బెర్తులు నిండిపోయాయి. మెయిల్ (12839), బొకారో (13351), కోరమాండల్ (12841) వంటి రెగ్యులర్ రైళ్లతోపాటు విశాఖ-చెన్నై ఎక్స్‌ప్రెస్ (22801), హౌరా-కన్యాకుమారి (12665), భువనేశ్వర్-పాండిచ్చేరి (12898), భువనేశ్వర్-చెన్నై సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12830), టాటా-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ (18189), షాలిమార్-చెన్నై ఎక్స్‌ప్రెస్ (22825) రైళ్లకు నిరీక్షణ జాబితా నెలకొంది. కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌కు (12841) ఈనెల 26వ తేదీన ఏసీ బెర్తులు అందుబాటులో ఉన్నాయి.

బెంగళూరు రైళ్లు

బెంగళూరు వెళ్లే రైళ్లలో వచ్చే నెల (ఫిబ్రవరి) 13వ తేదీ వరకు బెర్తులు ఫుల్ అయిపోయాయి. ప్రశాంతి (18463), హౌరా-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12863) తదితర రెగ్యులర్ రైళ్లతోపాటు ప్రతి ఆదివారం నడిచే విశాఖ-బెంగళూరు ప్రత్యేక రైలు (08543), హౌరా-బెంగళూరు దురంతో (12245), అగర్తాల-బెంగళూరు హంసఫర్ ఎక్స్‌ప్రెస్ (12504), హటియా-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12835), గుహవటి-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12510), భగల్‌పూర్-బెంగళూరు అంగా ఎక్స్‌ప్రెస్ (12254), అగర్తాల-బెంగళూరు హంసఫర్ (12504), కామాఖ్య-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12552), పూరి-యశ్వంత్‌పూర్ గరీబ్‌రథ్ (22833), టాటా-యశ్వంత్‌పూర్ (18111), జసిడిహ్ జంక్షన్-బెంగళూరు (22306) ఎక్స్‌ప్రెస్‌లలో బెర్తులు ముందే రిజర్వు అయిపోయాయి. టాటా-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12889), హౌరా-మైసూర్ ఎక్స్‌ప్రెస్ (22817), భువనేశ్వర్-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12845), హటియా-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (18637), న్యూటిన్సుకియా-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (22502), హౌరా-బెంగళూరు ఏసీ ఎక్స్‌ప్రెస్ (22863), ముజాఫర్‌పూర్-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (15228) రైళ్లలో కూడా బెర్తులు అందుబాటులో లేవు. కాగా, ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు ఈనెల 31వ తేదీన ఆర్‌ఏసీలో సీటు లభిస్తుండగా, తర్వాత రోజుల్లో నిరీక్షణ జాబితా నెలకొంది.

జోనల్ కమిషనర్ బరితెగింపు

... 3వ పేజీ తరువాయి

భవన నిర్మాణ యజమానులు స్పందించకపోతే టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బందిని పిలిచి అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని, అందరికీ మెమోలు ఇవ్వడంతోపాటు కమిషనర్ దృష్టికి తీసుకువెళతానని బెదిరిస్తున్నారు. అలాగే కార్యాలయంలో ఖర్చులు ఉన్నాయంటూ నెలవారీ మామూళ్ల వసూలు చేయిస్తున్నారని టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ఆరోపిస్తున్నారు. రెవెన్యూ విభాగంలో కూడా వేలుపెట్టి ప్రతి ఫైలును క్షుణ్ణంగా చూసి ఏదో ఒక కొర్రీ వేసి కిందిస్థాయి ఉద్యోగులు, సిబ్బందిని ఇబ్బందిపెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక ప్రజారోగ్యంలో కూడా తన ప్రతాపాన్ని చూపిస్తున్నారని ఆ విభాగం అధికారులు వాపోతున్నారు. అవుట్‌సోర్సింగ్ కార్మికుల హాజరును నిత్యం తనిఖీ చేస్తూ...కమీషన్‌గా కొంత మొత్తం ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారని వాపోతున్నారు. అవుట్‌సోర్సింగ్ కార్మికుడు ఎవరైనా విధులకు హాజరు కాకపోతే...శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను పిలిచి వారికి హాజరు వేసి, ఆ మొత్తాన్ని తనకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని సమాచారం. అలాగే జీవీఎంసీకి కొన్ని సంస్థలు సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) కింద ఇచ్చే నిధులను కూడా సదరు జోనల్ కమిషనర్ దుర్వినియోగం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఇంత జరుగుతున్నా సదరు జోనల్ కమిషనర్ జోలికి వెళ్లడానికి కమిషనర్ సాహసించలేకపోతున్నారంటున్నారు. అందుకు కారణం అధికార పార్టీ నాయకుడి అండదండలు సదరు అధికారికి పుష్కలంగా ఉండడమేనని జీవీఎంసీ అధికారులు, సిబ్బంది చెబుతున్నారు. సదరు నేత అండ చూసుకునే బరితెగించి వసూళ్లకు పాల్పడుతున్నారని అభిప్రాయపడుతున్నారు.

20న రౌండ్ టేబుల్ సమావేశం

ఎంవీపీ కాలనీ, జనవరి 17 : రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరం, వైజాగ్ ఎన్జీవో ఫోరం ఆధ్వర్యంలో ఈనెల 20న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్టు ఆ సంస్థ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఎంవీపీ కాలనీలోని ఎస్వీవీపీ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్లో జరిగే ఈ సమావేశంలో వచ్చే ఎన్నికల్లో రాజకీయ పార్టీలు బాలల కోసం ఏం చేస్తాయో ప్రకటించాలన్నడిమాండ్‌పై చర్చ జరగనుంది. ఉత్సాహం గల వారు 9032477463 ఫోన్ నంబరును సంప్రతించాలని వారు సూచించారు.

నేడు సినీ దర్శకుడు గోపాలకృష్ణకు సన్మానం

భీమునిపట్నం, జనవరి 17 : పట్టణంలోని శ్రీనివాసా ఫంక్షన్ హాల్‌లో కళా సాహితి ఆధ్వర్యంలో సినీ దర్శకుడు ఎస్. గోపాలకృష్ణను గురువారం సన్మానించనున్నట్టు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు రాజేంద్రప్రసాద్ వర్మ, సన్యాసిరాజు తెలిపారు. బుధవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ముందుగా బాలల సంప్రదాయ నృత్య ప్రదర్శన వుంటుందన్నారు.

నేడు ఎన్టీఆర్ వర్ధంతి సభ

భీమునిపట్నం, జనవరి 17 : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు 28వ వర్ధంతి సభ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం జరగనున్నట్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు తెలిపారు.బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తొలుత చిన్నబజారు జంక్షన్‌లో వున్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తామన్నారు. తర్వాత పార్టీ కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం, ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

540 మందికి వైద్య పరీక్షలు

భీమునిపట్నం, జనవరి 17 : పట్టణంలోని చిన్నబజారు వార్డు సచివాలయం పరిధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. 540 మంది రోగులకు వైద్యులు పరీక్షలు చేసి, మందులు అందజేశారు. వైద్య సేవలు పొందిన వారిలో మహిళలు 351 మంది, పురుషులు 189, విద్యార్థులు 14, గర్భిణులు 8 మంది ఉన్నారని జోనల్ కమిషనరు బి. రాము తెలిపారు. అలాగే నేత్ర వైద్య పరీక్షలు 87 చేయించుకోగా 32 మందికి కళ్లద్దాలు పంపిణీ చేయనున్నట్టు చెప్పారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



కళాకారుల నృత్య ప్రదర్శన

మధురవాడ, జనవరి 17 : మధురవాడ శిల్పారామంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలు బుధవారంతో ముగిసాయి. చివరి రోజు నగరానికి చెందిన మీనాక్షి కూచిపూడి డ్యాన్స్ అసోసియేషన్ కళాకారులు ప్రదర్శించిన పలు శాస్త్రీయ నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. కళాకారులు దీక్షిత, కుందన, సాహితి, వేదిత ప్రియ, సిరిచందన తదితరులు మీనాక్షి దర్శకత్వంలో పలు గీతాలకు నృత్య ప్రదర్శనలు ఇచ్చారు.

21న వ్యాసరచన పోటీలు

భీమునిపట్నం, జనవరి 17 : స్వాతంత్ర సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ జయంతి పురస్కరించుకుని ఈ నెల 21న విద్యార్థులకు జిల్లాస్థాయిలో వ్యాసరచన, వకృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్టు ఆదర్శ హిందీ ప్రేమి మండలి అధ్యక్షుడు కేఎస్ఆర్ కృష్ణారావు తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తెలుగు, హిందీ మాధ్యమాల్లో జరిగే ఈ పోటీలు ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతాయని చెప్పారు. తొలుత సుభాష్ చంద్రబోసు జీవిత విశేషాలపై వ్యాసరచన, తర్వాత దేశ భక్తిని ప్రేరేపించే చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే స్వాతంత్ర సముపార్జనలో అతివాదుల పాత్ర అన్న అంశంపై వకృత్వ పోటీలు ఉంటాయన్నారు. విజేతలకు 23న బహుమతులు అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్ 8985897419ను సంప్రతించాలన్నారు.

సినిమా గైడ్

- **నా సామిరంగ :** రమాదేవి, కిన్నెర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సప్తగిరి (తగరపువలస)
- **సైంధవ్ :** సంగం, వెంకటేశ్వర, కామేశ్వరి, లీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శారద, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మినీమోహిని, విశేష్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** జగదాంబ, మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్, శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 24, టమాటా 22,వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 34, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 52, బీరకాయలు 54, ఆనపకాయలు 22, కాలీఫ్లవర్ 22, క్యాబేజ్ 18, క్యారేట్ 36, దొండకాయలు 20, బంగాళా దుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 76, అల్లం (పాతది) 110, బరబటి 38, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 42, దోస కాయలు 36, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 34 , ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 24, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 54, చిలగడదుంపలు 30 , కంద 60, దేముడు చిక్కుడు 48, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 28, మామిడి అల్లం 60, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	554
విజయనగరం	558
శ్రీకాకుళం	558

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	95
ఫారం ధర	--	115
విత్ స్కిన్	--	200
స్కిన్‌లెస్	--	210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 8 లో..

ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినా.. ఓటర్ల నమోదు

- ఆర్డీఓ భాస్కర్‌రెడ్డి
- రాజకీయ పార్టీలతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ భాస్కర్‌రెడ్డి

భీమునిపట్నం, జనవరి 17 : ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినా నామినేషన్ల ఘట్టం ప్రారంభమయ్యే వరకూ అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవచ్చని ఆర్డీఓ ఎస్. భాస్కర్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం సాయంత్రం ఆయన తన కార్యాలయంలో ఓటర్ల జాబితా సవరణపై అఖిలపక్ష నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 22న ఓటర్ల జాబితా తుది జాబితా విడుదల చేస్తామని చెప్పారు. రాజకీయ పక్షాలు జాబితాను పరిశీలించుకుని అర్హులైన వారి పేర్లు లేక పోతే దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వాటిని పరిశీలించి ఓటరుగా నమోదు చేస్తామని తెలిపారు. నామినేషన్ల ఘట్టం ప్రారంభమైన తొలిరోజు వరకూ కొత్త ఓటర్ల నమోదు చేస్తామన్నారు. ఈమేరకు జాబితాను పూర్తిగా పరిశీలించుకోవాలని సూచించారు.కాగా భీమిలి నియోజకవర్గంలో ఇప్పటివరకూ మొత్తం ఓటర్లు 3,51,422 మంది వుండగా, పురుషులు 1,72,427., మహిళలు 1,78,957 మంది వున్నార న్నారు. జిల్లాలో అత్యధిక ఓటర్లున్న నియోజకవర్గం భీమిలి అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనరు కంటుభుక్త రామానాయుడు, టీడీపీ నాయకుడు రాంబాబు, కాంగ్రెస్ నాయకులు పల్లా వెంకటరావు, గాదం మహేష్, బీఎస్పీ నాయకులు పొట్టి రజనీకాంత్, భీమిలి ఎన్నికల డీటీ జె. భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికల్లో సౌకర్యాల లేమి

- కనీస సౌకర్యాలు లేక అవస్థలు
- కొన్నిచోట్ల స్థలాలు ఆక్రమణ
- మృతదేహాలను తీసుకువెళ్లే మార్గంలోనే చెత్త పారబోత



కనీస సదుపాయాలు లేని చిట్టివలసలోని శ్మశాన వాటిక

తగరపువలస, జనవరి 17 : భీమిలి జోనల్ కార్యాలయం పరిధిలోని శ్మశాన వాటికల్లో కనీస సదుపాయాలు లేకపోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలాచోట్ల శ్మశాన వాటికల కోసం కేటాయించిన స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. దీంతో మృతదేహాల దహన సంస్కారానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రెండో వార్డు పరిధిలోని నమ్మివానిపేట, సంగివలస, ఎడదాసరిపేట, కుమ్మరిపాలెం,మామిడిపాలెం ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. అలాగే తగరపువలస, చిట్టివలసకు చెందిన వారు గోస్తనీ నది తీరంలో ఉన్న శ్మశాన వాటికలో దహన సంస్కరణలు చేస్తుంటారు. అయితే ఇక్కడ రేకుల షెడ్ తప్ప ఇతర సదుపాయాలేవీ లేవు. ఆయా గ్రామాల్లోని చెత్తను తీసుకువచ్చి శ్మశాన వాటికలో పారబోస్తుండడంతో మృతదేహాలను తీసుకువచ్చే వారు వ్యర్థాల నుంచి వస్తున్న దుర్వాసనకు నరకం చూస్తున్నారు. శవ దహనం తరువాత స్నానాలు చేయడానికి కుళాయిలు కూడా లేవు. ఇటీవల కొందరు యువకులు తమ సొంత నిధులతో కొన్ని సౌకర్యాలు కల్పించారు. దొరతోట రోడ్డులో ఉన్న శ్మశాన వాటికలోనూ సౌకర్యాల లేమి నెలకొంది. ప్రతి రుద్రభూమిలో గొట్టపు బావులు నిర్మించాలని, వర్షం పడితే శవ దహనం చేయడానికి 16 అడుగుల ఎత్తులో షెడ్లు నిర్మించవలసి ఉన్నా అమలు కావడం లేదు. పాలకులు, అధికారులు స్పందించి శ్మశాన వాటికల్లో సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఆలయాన్ని శుభ్రం చేస్తున్న అధికారులు

అప్పన్న ఆలయంలో 'స్వచ్ఛ తీర్థ'

సింహాచలం, జనవరి 17 : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో ఈఓ శ్రీనివాసమూర్తి సారథ్యంలో ఉద్యోగులు బుధవారం స్వచ్ఛ తీర్థ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈమేరకు గంగధార జలాల ప్రాంతంతో పాటు బేడా మండపం, రాతి స్తంభాలను, వివిధ దేవతామూర్తుల ఆలయ ద్వారాలను, నీలాద్రిగుమ్మ, భోగ మండపాన్ని శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు భ్రమరాంబ, నరసింగరావు, పలువురు అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

ఘనంగా ముక్కనుమ



భీమునిపట్నం, జనవరి 17 : కనుమ, ముక్కనుమను పురస్కరించుకుని పట్టణంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గోవులకు బుధవారం వృషభోత్సర్జన సేవ నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆర్. సింగరాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి, గోవులను పూజించారు.

పూడికతీతతో చిల్లపేట చెరువుకు జల కళ



నీటితో కళకళలాడుతున్న చెరువు

తగరపువలస, జనవరి 17 : తగరపువలస నుంచి భీమిలికి వెళ్లే ప్రధాన రహదారిలో చిల్లపేట వద్ద ఉన్న చెరువు నీటితో కళకళలాడుతోంది. చెరువులో పూడిక తీసి, అభివృద్ధి చేయడానికి జీవీఎంసీ రూ 6.50 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో పూడికతీత చేపట్టారు. దీంతో చెరువు నీటితో కళకళలాడుతోంది. చెరువులోకి మురుగు నీరు రాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు నీరు నిల్వ ఉండేలా గట్లు ఎత్తు చేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రధాన రహదారి నుంచి అమ్మవారి గుడి వరకు చెరువు గట్టు ఎత్తు చేసి రహదారి మాదిరిగా నిర్మించారు. ప్రస్తుతం చెరువుకు నాలుగు వైపులా రహదారి నిర్మించినట్లయితే వాకర్స్‌కు ఎంతగానో ఉపయోగపడుతుందని పలువురు అంటున్నారు. ఆ దిశగా పాలకులు, అధికా రులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి విరాళం

పద్మనాభం, జనవరి 17 : పద్మనాభం జంక్షన్ సమీపంలో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి టీడీపీ నాయకులు సుంకర అచ్చింనాయుడు, హారిక దంపతులు బుధవారం రూ. 20 వేలు విరాళం అందించారు. ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ ప్రతినిధులు ఎం. శ్రీనివాసరావు, సుందరరావుకు అందజేశారు. కమిటీ సభ్యులు దాతను సత్కరించారు.

అప్పన్నను దర్శించుకున్న పద్మనాభానందస్వామీజీ



స్వామివారి సన్నిధిలో రుషీకేష్ స్వామి

సింహాచలం, జనవరి 17 : రుషీకేష్ ప్రాంతానికి చెందిన శివానందాశ్రమ ప్రతినిధి పద్మనాభానంద మహరాజ్ తన శిష్యులతో కలిసి వరాహలక్ష్మీనృసింహస్వామిని బుధవారం దర్శించుకున్నారు.ఆయనకు దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తి, ఏఈఓ భ్రమరాంబ, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. నాదస్వరాలపనల నడుమ బేడామండపం ప్రదక్షిణలు చేసిన స్వామి గోత్ర నామాలతో అంతరాలయంలో నృసింహునికి పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం అనంతరం పండితులు చతుర్వేద స్వస్తి వచనాలతో ఆశీస్సులీయగా, అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

రోడ్లపై విచ్చలవిడిగా పశువుల సంచారం



తగరపువలస కూడలిలో డివైడర్ల వద్ద పశువులు

తగరపువలస, జనవరి 17 : తగరపువలసలోని పలు రహదారుల్లో పశువులు ఇష్టానుసారంగా సంచరిస్తున్నాయి. వీటివల్ల వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా అంబేడ్కర్ కూడలి నుంచి వైఎస్ఆర్ కూడలి వరకు ఉన్న రహదారిలో పశువుల సంచారం ఎక్కువగా ఉంటోంది. ఈ ప్రాంతంలో సంత ఉండడంతో కూరగాయలు, పండ్లు అమ్మకాలు జరుగుతుంటాయి. దీంతో ఎక్కువ పశువులు ఈ రోడ్డులోనే సంచరిస్తుండడంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే తగరపువలస నుంచి భీమిలి వెళ్లే ప్రధాన రహదారిలో చిల్లపేట, జీరుపేట వద్ద పశువులు నిత్యం రోడ్డు మీదే ఉంటున్నాయి. అధికారులు గతంలో పశువుల పెంపకందారులు నోటీసులు జారీ చేసినప్పటికీ ఫలితం లేకపోతోంది.

అప్పన్న సన్నిధిలో పార్లమెంటు కమిటీ సభ్యులు

సింహాచలం, జనవరి 17 : వరాహలక్ష్మీనృసింహస్వామిని ఎంపీ రమేష్ బిదూరి చైర్మన్‌గా ఉన్న స్టాం డింగ్ కమిటీ ఆన్ పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ సభ్యులు బుధవారం దర్శించుకున్నారు. వారికి ఈఓ శ్రీనివాసమూర్తి ఆహ్వానం పలికారు. కప్ప స్తంభం ఆలింగనం చేసుకుని బేడామండప ప్రదక్షిణలు చేసిన కమిటీ సభ్యుల గోత్ర నామాలతో అంతరాలయంలో ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలివ్వగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.



ఆలయ శిఖర దర్శనం చేసుకుంటున్న కమిటీ సభ్యులు

దేశంలోనే విశాఖ హెచ్‌పీసీఎల్ రెండవ అతిపెద్ద రిఫైనరీ

పార్లమెంటు నిర్దేశించిన లక్ష్యాల మేరకు కమిటీ సభ్యులు దేశంలో పర్యటిస్తూ పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ సరఫరా, నిల్వలు, తదితర అంశాలపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేస్తున్నట్టు స్టాం డింగ్ కమిటీ ఆన్ పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ చైర్మన్, ఎంపీ రమేష్ బిదూరి చెప్పారు. స్వామి వారి దర్శనం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. విశాఖలోని హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ దేశంలో రెండవ అతిపెద్ద రిఫైనరీగా పేర్కొన్నారు. అనంతరం సింహగిరి ప్రధాన మాడవీధిలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు.



ఆలయానికి భక్తులు వచ్చే మార్గంలో స్తంభాలకు వేసిన రంగులు

భైరవస్వామి ఆలయ మార్గంలో స్తంభాలకు వైసీపీ రంగులు

సింహాచలం, జనవరి 17 :వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం అనుబంధ ఆలయం భైరవవాకలోని భైరవస్వామి ఆలయానికి వెళ్లే మార్గం రెండు వైపులా దేవస్థానానికి, అటవీ శాఖకు సరిహద్దులు తెలిపే విధంగా సిమ్మెంటు స్తంభాలను ఏర్పాటు చేశారు. వీటికి కూడా వైసీపీ రంగులు వేయడాన్ని భక్తులు తప్పుపడుతున్నారు. ఆలయ పరిధిలో కూడా పార్టీల రంగులు వేయటం ఏమిటని విమర్శిస్తున్నారు. తక్షణమే స్పందించి దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తే ఊరుకోం

ఇంటక్ ప్లాంట్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్

ఉక్కుటౌన్ షిప్, జనవరి 17 : ఉక్కు కర్మాగారం కార్మికులను ఇబ్బందులు గురిచేస్తే సహించేది లేదని ఇంటక్ ప్లాంట్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ పేర్కొన్నారు. ప్లాంట్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులను ఏదో ఒకవిధంగా ఇబ్బందులు పెట్టేందుకు యాజమాన్యం కుట్ర పన్నుతోందని, దీని వల్ల వారు మనోధైర్యాన్ని కోల్పోతున్నారన్నారు. ఉద్యోగుల సంఖ్య తగ్గింపు అనేది కుట్ర అని, ఇదంతా ప్లాంట్‌ను నిర్వీర్యం చేసేందుకేనని ఆరోపించారు. సంస్థ ప్రగతి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కార్మిక వర్గాన్ని ప్రోత్సహించాల్సిన యాజమాన్యం దుర్మార్గంగా వారిని ఇబ్బందులు పెడుతుండడం దారుణమన్నారు. ప్లాంట్‌లో ఏ ఒక్క కార్మికునికి అన్యాయం జరిగిన సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో ఇంటక్ ప్లాంట్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆశాజ్యోతి జ్యోతిబసు

మద్దిలపాలెం, జనవరి 17 : పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి జ్యోతి బసు పేదల ఆశాజ్యోతి అని సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు, కార్పొరేటర్ బి. గంగారావు అన్నారు. బుధవారం ఆయన మద్దిలపాలెంలోని ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన జ్యోతిబసు 14వ వర్ధంతి సభలో మాట్లాడారు. దేశంలో దోపిడీ వ్యవస్థను కూల్చి సోషలిస్టు వ్యవస్థ రావాలన్న సిద్ధాంతాన్ని నమ్మిన గొప్ప విప్లవకారుడు జ్యోతిబసు అన్నారు.1977లో వామపక్ష ప్రభుత్వానికి ముఖ్యమంత్రిగా నాయకత్వం వహించి పేదలకు భూ పంపిణీ చేశారని చెప్పారు. రైతులు పండించిన పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసి రేషన్ డిపోల ద్వారా చవకగా అందించే ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేశారన్నారు. 23 ఏళ్ల సీఎంగా పనిచేసి పార్టీ సిద్ధాంతాలను అమలు పరిచిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జీవీఎస్ చలపతి, ఏవీ పద్మావతి, కృష్ణారావు, పీతల అప్పారావు, తులసీరాం, తదితరులు పాల్గొన్నారు.

20న 'మన ఇంటి పంట'

మద్దిలపాలెం, జనవరి 17 : ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఈనెల 20న మన ఇంటి పంట కార్యక్రమం నిర్వహించనున్నట్టు గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం అధ్యక్షుడు మురళీధర్ తెలిపారు. బుధవారం ఆయన శివాజీపాలెంలోని ఆ సంఘం కార్యాలయంలో విలేకరుతో మాట్లాడారు. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమంలో రైతు నేస్తం ప్రతినిధి, పద్మశ్రీ వై. వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ఇంటి దగ్గర పండించే పంటల గురించి తెలియజేసి, సందేహాలను నివృత్తి చేస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

'షర్మిల రాకతో వైసీపీ నాయకుల్లో బెదురు'

మద్దిలపాలెం, జనవరి 17 : షర్మిల రాకతో వైసీపీ నాయకుల్లో బెదురు మొదలైందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కొయ్య రామకృష్ణయాదవ్ అన్నారు. బుధవారం ఆయన మద్దిలపాలెంలో విలేకరులతో మాట్లాడారు. షర్మిల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం రావడం ఖాయమని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ లేదంటూనే తమ పార్టీ గురించి మంత్రి అమర్‌నాథ్ స్పందించడం హాస్యాస్పదమన్నారు. కాంగ్రెస్ పార్టీలో స్వర్గీయ గుడివాడ గురునాథ్ మంత్రిగా పనిచేసిన విషయాన్ని ఆయన కుమారుడు అమర్ గుర్తుచేసుకోవాలని సూచించారు. జగన్ తుగ్లక్ పాలన వల్లే షర్మిల వైసీపీని వీడి కాంగ్రెస్‌లో చేరారని విమర్శించారు.

'కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం ఖాయం'

ఎంవీపీ కాలనీ : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా షర్మిల నియామకం పట్ల విశాఖ ఇస్లామిక్ ఉమెన్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ పర్విన్ బాబీ బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. షర్మిల నియామకంతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని, కాంగ్రెస్ పార్టీతోనే మైనార్టీలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు.

బావికొండను సందర్శించిన బౌద్ధ భిక్షువులు



బుద్ధ వందనం చేస్తున్న భిక్షువులు

భీమునిపట్నం, జనవరి 17 : బీచ్‌రోడ్‌లోని తిమ్మాపురం బావికొండ బౌద్ధ క్షేత్రాన్ని విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య, డిస్ట్రిక్ట మహాబోధి సొసైటీ ఆధ్వర్యంలో పలువురు బౌద్ధ భిక్షువులు బుధవారం సందర్శించారు. బౌద్ధ మేళాలో భాగంగా ఈ క్షేత్రాన్ని సందర్శించినట్టు ఇంటర్నేషనల్ బుద్దిస్ట్ ధమ్మ దూత్ సొసైటీ ప్రతినిధి డా. ధ్యానదీప్ మహాదేరో, బోధిరత్న మహాదేరో తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాన స్థూపం వద్ద పుష్పాంజలి, బుద్ధ స్థూపం వద్ద చైతన్య వందనములు, ధర్మదీక్ష నిర్వహించారు. అనంతరం జిల్లా మహాబోధి సొసైటీ అధ్యక్షుడు జి. బాబులు ఆధ్వర్యంలో బావికొండ పాదాల నుంచి కొండపై ఉన్న ప్రధాన స్థూపం వరకూ పంచశీల శాంతియాత్ర నిర్వహించారు.

ఆటో డ్రైవర్ సుందరం సేవలు అభినందనీయం



డ్రైవర్ సుందరాన్ని అభినందిస్తున్న సూపరింటెండెంట్ కిశోర్‌కుమార్

ఆరిలోవ, జనవరి 17 : ఆటో డ్రైవర్ సుందరం గర్భిణులను కాన్పు సమయంలో ఆస్పత్రులకు ఉచితంగా తీసుకువెళుతుండడం అభినందనీయమని కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ ఎస్. కిశోర్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో సుందరాన్ని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 24 ఏళ్లుగా సుందరం గర్భిణులకు ఒక అన్నగా ఉచిత ప్రయాణ సేవలు అందించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ప్రతిఒక్కరిలోనూ ఇటువంటి సేవా గుణం ఉండాలన్నారు. కార్యక్రమంలో హిమ ఫౌడర్ టీవీడీ దాస్, సభ్యులు కె. సూర్యనారాయణ, సుంకాన శ్రీనివాస్, డి.జగన్మోహన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో జనసేన నాయకులు సందీప్, తదితరులు

ఆనందపురం, జనవరి 17 : మండలంలోని కణమాం పంచాయతీకి చెందిన పలువురు బుధవారం జనసేన పార్టీలో చేరారు. వారికి ఆ పార్టీ భీమిలి నియోజకవర్గం ఇన్‌చార్జి పంచకర్ల సందీప్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ జనసేన బలంగా ముందుకు వెళ్లడానికి ఇది శుభపరిణామమన్నారు. జన సైనికులు వచ్చే 90 రోజులు కష్టపడి పనిచేసి, నియోజకవర్గంలో పార్టీ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. త్వరలో పోలింగ్ బూత్ కమిటీలు ఏర్పాటు చేయనుండడంతో నాలుగు రోజుల్లో నివేదికలు అందజేయాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో జనసేన జిల్లా రూరల్ ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, కార్యదర్శి మజ్జి శ్రీను, వార్డు అధ్యక్షుడు శ్రీనుబాబు, మండల అధ్యక్షుడు తమ్మిన అప్పలరాజు, మండల ప్రధాన కార్యదర్శి మూర్తి, నాయకులు శివకృష్ణ, గోవింద్ పాల్గొన్నారు.

వరి కంకులు ఏర్పాటు

సింహాచలం, జనవరి 17 : పూర్వీకుల ఆచారాన్ని కొనసాగిస్తూ సింహాచలం దేవస్థానంలో పక్షుల ఆహారం కోసం వరి కంకులు ఏర్పాటు చేశారు. ఈఓ ఎస్. శ్రీనివాసమూర్తి ఆదేశాల మేరకు సిబ్బంది దేవస్థానానికి చెందిన పలు ప్రాంతాల్లో వరి కంకుల గుత్తులను బుధవారం వేలాడదీశారు. అలాగే సింహాద్రినాథుని ఆలయంలో కూడా అనేక ప్రదేశాల్లో వీటి ఏర్పాటు చేస్తామని ఈఓ చెప్పారు.



వరి కంకులతో ఈఓ శ్రీనివాసమూర్తి, ఆలయ ఉద్యోగులు